Follow: @ANNTELUGU

ANN తెలుగు

20-09-2025

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 286 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## పవన్ కల్యాణ్ ఓజీ సినిమాకు తెలంగాణ సర్కార్ ప్రత్యేక అనుమతి

### టికెట్ ధరను రూ. 800 వరకు పెంచుకోవచ్చని వెసులుబాటు

పవర్ స్టార్ అభిమానులకు ముందుగానే పండగ

**హైదరాబాద్, మహా:** పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ' సినిమాకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. సినిమా విడుదల రోజుకు ఒకరోజు ముందు ప్రత్యేక ప్రదర్శనలకు, టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 'ఓజీ' సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న తేదీకి ముందు రోజు, అంటే సెప్టెంబర్ 24వ తేదీన రాత్రి 9 గంటలకు ఒక ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేసుకునేందుకు చిత్ర బృందానికి తెలంగాణ ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ప్రత్యేక ప్రదర్శన కోసం టికెట్ ధరను గరిష్ఠంగా రూ. 800 వరకు నిర్ణయించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ నెల 25న సినిమా విడుదల కానుంది. విడుదల రోజు నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు టిక్కెట్ ధరల పెంపునకు ప్రభుత్వం వీలు కల్పించింది. సింగిల్ స్క్రీన్‌లో రూ. 100 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌లో రూ. 150 (జీఎస్టీతో కలిపి) పెంచుకోవడానికి అనుమతి ఇచ్చింది.

**టాప్ న్యూస్**


### పార్టీ మారుతాననడం అబద్ధం



- పదే పదే శీల పరీక్ష చేయొద్దు
- ఎంపీ ఈటల సంచలన ట్వీట్

02

### పోలవరం పనుల్లో గిన్నిస్ రికార్డు సృష్టించాం



- డిసెంబర్ 25 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం: సీఎం చంద్రబాబు
- జగన్ చేతకాని పాలనలో పోలవరం పనులు రివర్స్ అయ్యాయని ఫైర్

02

### నాపై ఇంటెలిజెన్స్ నిఘా..



- కాంగ్రెస్ లోనే ఉంటా.. రాజీనామా చేయను
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- యెన్నం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలు సరైనవే

02

SRI GOLD
TRUSTED GOLD BUYERS

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,11,330 |
| 22 క్యారెట్ | 1,02,050 |
| సిల్వర్ (కేజీ) | 1,33,000 |

# యూరియా కొరత రాజకీయ సృష్టే

## కండువా వేస్తే పార్టీ మారినట్లేనా?

## బీఆర్ఎస్ నేతలకే స్పష్టత కరువు

- ఆడబిడ్డ కవితపై.. నలుగురు కలిసి దాడి చేస్తున్నారు
- కవిత కాంగ్రెస్ లో చేరుతానంటే వ్యతిరేకిస్తా..
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం జీతం నుండి బీఆర్ఎస్ కు ప్రతీనెలా 5వేలు
- ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి ఇవ్వం
- కాళేశ్వరం కేసు సీబీఐకి ఇస్తే.. కిషన్ రెడ్డి ఎందుకు నోరుమెదపట్లే?
- ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిట్ చాట్



**ఢిల్లీ, మహా :** తన ఇంటికొచ్చిన వాళ్లకు కండువా వేస్తే పార్టీ మారినట్లు అవుతుందా? అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తన ఇంటికి వచ్చే వారి మెడలో ఏ కండువా వేస్తానో వచ్చేవాళ్లకు ఏం తెలుసని ఢిల్లీలో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులపై నిర్దిష్ట నియమాలు ఏవీ స్పష్టంగా లేవని, ఎమ్మెల్యేలు పార్టీ మారిన అంశంపై బీఆర్ఎస్ నేతలకే స్పష్టత కొరవడిందన్నారు. బీఆర్ఎస్‌కు 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని హరీశ్‌రావు అసెంబ్లీలో వెల్లడిస్తే, 37 కాదు అని కేటీఆర్ ఇంకో సంఖ్య చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన జీతభత్యాల నుంచి ఇప్పటికీ నెలకు రూ. 5 వేలు బీఆర్ఎస్ఎల్పీకి వెళుతున్నాయని చెప్పినట్లు ముఖ్యమంత్రి విలేకరులకు వివరించారు.

వివరాలు 2లో



### కేసీఆర్‌ను ట్రంప్‌తో పోల్చిన సీఎం రేవంత్

- ట్రంప్ లాంటి వ్యక్తుల ఆటలు ఎక్కువ రోజులు సాగవని హెచ్చరిక
- ప్రజలు కేసీఆర్ ను ఫామ్ హౌస్ కు పంపారని వ్యాఖ్య
- బిజినెస్ స్టాండర్డ్స్ యాన్యువల్ ఫోరం సదస్సులో ప్రస్తావించిన సీఎం

02

## టీ20 క్రికెట్‌లో భారత్ అరుదైన మైలురాయి

### టీ20 ఫార్మాట్‌లో 250 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న టీమిండియా



**మహా:** భారత క్రికెట్ జట్టు పొట్టి ఫార్మాట్‌లో ఓ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 250 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న రెండో జట్టుగా చరిత్ర సృష్టించింది. ఆసియా కప్ 2025లో భాగంగా శుక్రవారం ఒమన్‌తో గ్రూప్‌ఏ మ్యాచ్ ద్వారా టీమిండియా ఈ మైలురాయిని అందుకుంది. ఇప్పటివరకు అత్యధిక టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన రికార్డు పాకిస్థాన్ పేరిట ఉంది. పాక్ జట్టు మొత్తం 275 మ్యాచ్‌లతో ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. పాకిస్థాన్ తర్వాత ఈ ఘనత సాధించిన జట్టుగా భారత్ నిలిచింది. ఈ జాబితాలో న్యూజిలాండ్ మూడో స్థానంలో ఉంది. కివీస్ జట్టు ఇప్పటివరకు 235 టీ20 మ్యాచ్‌లు ఆడింది. వారి తర్వాత వెస్టిండీస్ 228 మ్యాచ్‌లతో నాలుగో స్థానంలో, శ్రీలంక 212 మ్యాచ్‌లతో ఐదో స్థానంలో ఉన్నాయి. సుదీర్ఘకాలంగా టీ20 ఫార్మాట్‌లో నిలకడగా రాణిస్తున్న భారత జట్టు ఈ ఫార్మాట్‌లో మరో మైలురాయిని చేరుకోవడం విశేషం.



## ఐఫోన్ తోపులాట

- ఉద్రిక్త పరిస్థితి... రంగంలోకి పోలీసులు
- మార్కెట్లో 17 సిరీస్ విక్రయాలు
- అర్ధరాత్రి నుంచే అనేకచోట్ల క్యూలు
- ప్రో మాక్స్ ధర 1,49,900 రూపాయలు
- మన దేశంలోనే ఎక్కువ ధరకు అమ్మకాలు

02

## ఇండ్ల నిర్మాణంలో డబ్బులు వసూళ్లు చేస్తే సస్పెండే..

### అవినీతికి పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించబోం

- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వార్నింగ్
- ఇండ్లు మంజూరుకాని వారి ఖాతాలో నిధులు జమ.. గ్రామ సెక్రటరీలను తొలగించాలని ఆర్డర్స్
- లంచమడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 18005995991కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచన



02

## త్వరలోనే టూరిజం కాన్‌క్లేవ్

### పర్యాటకంలో పెట్టుబడులే లక్ష్యం

### ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్‌లో మంత్రి జూపల్లి

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని, పర్యాటకంలో పెట్టుబడులే లక్ష్యంగా త్వరలోనే తెలంగాణలో అత్యున్నత స్థాయి టూరిజం కాన్‌క్లేవ్ ను నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరిగిన ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్ (టీటీఎఫ్) 2025 ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, ఇటీవల నూతన పర్యాటక విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని గుర్తు చేశారు.

మిగతా 2లో





## జూనియర్ ఎన్టీఆర్‌కు గాయం

- యాడ్ షూటింగ్‌లో ఘటన
- హైదరాబాద్‌లో వాణిజ్య ప్రకటన షూటింగ్
- ఎన్టీఆర్‌ను వెంటనే ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చిన వ్యక్తిగత సిబ్బంది

02

**స్టాక్ మార్కెట్**

| | | |
|---|---|---|
| సెన్సెక్స్ | ↗ | 82,626.23 |
| నిఫ్టీ | ↗ | 25,327.05 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.4 | 162 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.4 | 162 |
| రిటైల్ గుడ్డు ధర | 5.72 | 171.72 |

ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక

## ప్రజా దర్బార్

### సమస్యలపై వినతులు స్వీకరించిన కంది శ్రీనివాస రెడ్డి

05








### బిందు స్టూడియోస్ నిర్మాణంలో
# నెల్లూరి నెరజాణ
## దుమ్మురేపుతున్న సాంగ్

**హైదరాబాద్, మహా:** సిత్రాంగి సిలకవే నువ్వు.. నెల్లూరి నెరజాణవే నువ్వు అంటూ బిందు స్టూడియోస్ నిర్మాణంలో రూపొందించిన వీడియో సాంగ్ ఆకట్టుకుంటోంది. బిందుప్రియ కొండా నిర్మాణంలో రూపొందించిన ఒక నిమిషం ప్రోమో.. సూపర్ రెస్పాన్స్ దక్కించుకుంది. సినిమా రేంజ్ లో పాటచిత్రీకరణ చేసిన నిర్మాణసంస్థను పలువురు ప్రముఖులు అభినందించారు. అనిల్ రాజు రత్నాకరం ఈ సాంగ్ కు దర్శకత్వం వహించగా, ఢీ రాజు రాను బొంబాయి రాను ఫేం లిఖిత జోడీ అదరగొట్టారు. ఈశ్వర్ పెంటి కొరియోగ్రఫీ చేయగా, సుభాష్ నారాయణ సంగీతం అందించారు. బొల్లేపల్లి మహేంద్రబాబు సమర్పణలో అద్భుతంగా రూపొందిందిం. బిందు స్టూడియోస్ సీఈవో ఎస్వీరవి పర్యవేక్షించారు . గణనాథుడిపై రూపొందించిన తొలిపాట గణనాయక అష్టకం బాహుబలి రచయిత విజయేంద్రప్రసాద్, ఎఫ్ డిసి ఛైర్మన్ దిల్ రాజు, ప్రముఖ నిర్మాత బన్నీవాసు ఆవిష్కరించారు. నిర్మాణంలో నాణ్యత, భారీతనం, మంచి కాన్సెప్ట్ లతో బిందుస్టూడియో ప్రత్యేకత సంపాదించుకుంటోంది.

# యూరియా కొరత
# రాజకీయ సృష్టే

**ఢిల్లీ, మహా**

తన ఇంటికొచ్చిన వాళ్లకు కండువా వేస్తే పార్టీ మారినట్లు అవుతుందా? అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తన ఇంటికి వచ్చే వారి మెడలో ఏ కండువా వేస్తానో వచ్చేవాళ్లకు ఏం తెలుసని ఢిల్లీలో నిర్వహించిన చిట్ చాట్‌లో సీఎం మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులపై నిర్దిష్ట నియమాలు ఏవీ స్పష్టంగా లేవని, ఎమ్మెల్యేలు పార్టీ మారిన అంశంపై బీఆర్ఎస్ నేతలకే స్పష్టత కొరవడిందన్నారు. బీఆర్ఎస్‌కు 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని హరీశ్‌రావు అసెంబ్లీలో వెల్లడిస్తే, 37 కాదు అని కేటీఆర్ ఇంకో సంఖ్య చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన జీతభత్యాల నుంచి ఇప్పటికీ నెలకు రూ. 5 వేలు బీఆర్ఎస్ఎల్పీకి వెళుతున్నాయని చెప్పినట్లు ముఖ్యమంత్రి విలేకరులకు వివరించారు.

**కవితపై నలుగురు కుటుంబసభ్యుల దాడి**

ఎమ్మెల్సీ కవిత వ్యవహారం అంతా కుటుంబం, ఆస్తి పంపకాల వివాదమేనని, ఒక ఆడబిడ్డపై నలుగురు కలిసి దాడి చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కల్వకుంట్ల కుటుంబ వ్యవహారంలో సామాన్య ప్రజలకు ఏం సంబంధం లేదని కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు ఎప్పుడో సామాజికంగా బహిష్కరించారని తెలిపారు. 2014 నుంచి 19 మధ్య కేసీఆర్ కేబినెట్ లో ఒక్క మహిళ కూడా లేదని ఆక్షేపించారు. కేసీఆర్ కొన్ని వందల మంది పిల్లల ఉసురు పోసుకున్నారని, ఉద్యమం పేరుతో పోసుకున్న ఉసురు ఊరికే పోదని తీవ్ర విమర్శలు చేశారు. ఎంతోమంది తల్లిదండ్రులకు కేసీఆర్ కడుపుకోత మిగిల్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కిషన్ రెడ్డి మెలికలు**

మెట్రో విషయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కేటీఆర్ కలిసి మెలికలు పెడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కేటీఆర్ చెబితే ఢిల్లీలో కిషన్‌రెడ్డి అదే చేస్తున్నారని అన్నారు. కేంద్రంలో ఉన్న కిషన్‌రెడ్డి ఇలాంటి మెలికలు పెడుతున్నారని, ఎల్ అండ్ టీతో ఒప్పందం ఉంటేనే అనుమతులు ఇస్తామని కేంద్ర ప్రభుత్వ చెబుతోందని వెల్లడించారు. ప్రాజెక్టు వ్యయానికి ఎల్ అండ్ టీ అడుగుతున్న దానికి చాలా వ్యత్యాసం ఉందని, మెట్రో రైలు విస్తరణకు ఎల్ అండ్ టీ సంస్థ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో చివరి మైలు వరకు మెట్రో విస్తరించాలని చూస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎల్ అండ్ టీకి ప్రభుత్వం పలుచోట్ల స్థలాలు ఇచ్చిందని, వాటిని అభివృద్ధి చేసుకునే వెసులుబాటు కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం ఇచ్చిన స్థలాలపై ఎల్ అండ్ టీ దృష్టి సారించలేదని చెప్పారు. కేసీఆర్ ఘనకార్యం వల్ల మెట్రోలో రాష్ట్ర ప్రజలపై రూ.3 వేల కోట్ల భారం పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగితే 15 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తారని సీఎం తెలిపారు.

**కాళేశ్వరంపై విచారణ ఏమైంది?**

కాళేశ్వరం దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని కిషన్‌రెడ్డి పదేపదే అడిగారని, తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన 48 గంటల్లోనే విచారణ చేపట్టేలా చూస్తా అన్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. సీబీఐకి కేసు ఇచ్చి ఇన్ని రోజులైనా, దీనిపై కిషన్‌రెడ్డి ఎక్కడా మాట్లాడటం లేదని ఆరోపించారు. సీబీఐ దర్యాప్తును ఆపమని కేటీఆర్ చెప్పినందు వల్లే కిషన్‌రెడ్డి దానిని అమలు చేశారని ఆరోపించారు. కేటీఆర్, కిషన్‌రెడ్డి మధ్య అంతటి అవినాభావ సంబంధం ఉందని చెప్పారు. కమిషన్ అంటే నిజానిజాలు నిర్ధరణ చేసే ఒక వ్యవస్థ అని 132 మందిని విచారణ చేసి వారి వాంగ్మూలాలు నమోదు చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అన్నీ నమోదు చేసి ఎవరు ఏ తప్పు చేశారో కమిషన్ నిర్ధారించిందని, ఇప్పుడు సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసి మొదటి నుంచి దర్యాప్తు చేయాల్సి ఉంటుందని అన్నారు. కాళేశ్వరం బ్యారేజీలపై సీబీఐ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని, హైకోర్టులో లేకపోతే ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా సీబీఐకి ఇచ్చే వాళ్లమని వెల్లడించారు. అవగాహన లేని వాళ్లు మాట్లాడే ప్రతిదానికి తాను స్పందించే అవసరం లేదని స్పష్టం చేశారు.




# కేసీఆర్‌ను ట్రంప్‌తో పోల్చిన సీఎం రేవంత్

### ట్రంప్ లాంటి వ్యక్తుల ఆటలు ఎక్కువ రోజులు సాగవని హెచ్చరిక
### ప్రజలు కేసీఆర్ ను ఫామ్ హౌస్ కు పంపారని వ్యాఖ్య
### బిజినెస్ స్టాండర్డ్స్ యాన్యువల్ ఫోరం సదస్సులో ప్రస్తావించిన సీఎం

**న్యూఢిల్లీ, మహా :** తెలంగాణలో గతంలో ఒక డొనాల్డ్ ట్రంప్ ఉండేవారని, ఆయన పాలన నచ్చకే ప్రజలు మూకుమ్మడిగా ఓడించి ఫామ్‌హౌస్‌లో కూర్చోబెట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి ఆయన పరోక్షంగా ఈ విమర్శలు చేశారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన 'బిజినెస్ స్టాండర్డ్స్ యాన్యువల్ ఫోరం' సదస్సులో పాల్గొన్న రేవంత్ రెడ్డి, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "ట్రంప్ లాంటి వ్యక్తుల ఆటలు ఎక్కువ రోజులు కొనసాగవు. వాళ్లు రాత్రి కలలో అనుకున్నది పగలు అమలు చేస్తుంటారు. ట్రంప్ ఒకరోజు ప్రధాని మోదీ తన మిత్రుడు అంటారు, మరుసటి రోజే భారత్‌పై 50 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తానని బెదిరిస్తారు" అని విమర్శించారు. భవిష్యత్తులో భారతీయులకు వీసాలు ఇవ్వకపోతే నష్టపోయేది అమెరికానే అని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ అభివృద్ధికి తమ ప్రభుత్వం వద్ద స్పష్టమైన రూట్‌మ్యాప్ ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చే ప్రణాళికలో భాగంగా, త్వరలోనే 3,000 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం నగరంలో నడుస్తున్న నాన్‌ఈవీ బస్సులను పూర్తిగా గ్రామాలకు తరలిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాల్లో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని గుర్తు చేశారు. హైదరాబాద్‌బెంగళూరు మధ్య బుల్లెట్ రైలు ఏర్పాటు ప్రతిపాదన ఉందని, ఔటర్ రింగ్ రోడ్డుకు అనుబంధంగా రీజనల్ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు ఏర్పాటు చేసిన 'ఈగల్ స్క్వాడ్' సమర్థవంతంగా పనిచేస్తోందని, ఇటీవల విడుదలైన పోలీస్ ర్యాంకింగ్‌లో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

### పార్టీ మారుతాననడం
# అబద్ధం
## పదే పదే శీల పరీక్ష చేయొద్దు
### ఎంపీ ఈటల సంచలన ట్వీట్

**హైదరాబాద్, మహా :** పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టత ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'మీడియా, వార్తాపత్రికలు, యూట్యూబ్ ఛానల్ వారికి విజ్ఞప్తి. నేను పార్టీ మారుతున్నానంటూ కొన్ని మీడియా, వార్తాపత్రికలు, యూట్యూబ్ ఛానల్లలో వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నాను. బురద చల్లి కడుక్కోమనటం.. బట్ట కాల్చి మీద వేయడం మంచిది కాదు. నేను మాటలు మార్చే, పార్టీలు మారే వ్యక్తిని కాదు. పార్టీలు మారడం బట్టలు మార్చుకున్నంత ఈజీ కాదు. పార్టీ మారడం జీవితంలో గొప్ప నిర్ణయంగా ఉండాలి.. గొప్ప కారణం ఉండాలి. టీఆర్ఎస్ నుంచి కూడా బయటికి పంపిస్తే వచ్చాను తప్ప నా అంతట నేను రాలేదు. నన్ను అక్కున చేర్చుకున్న పార్టీ బీజేపీ. పార్టీ మారుతున్నానంటూ రాస్తున్న వార్తలను, చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. పదే పదే శీల పరీక్ష చేయడం మంచిది కాదు. వ్యక్తిత్వ హననం చేయకండి. ఇక మీ విజ్ఞతకే వదిలేస్తున్నాను' అంటూ ఈటల ట్వీట్‌లో పేర్కొన్నారు.

# ఇండ్ల నిర్మాణంలో డబ్బులు వసూళ్లు చేస్తే సస్పెండే..
## అవినీతికి పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించబోం

- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వార్నింగ్
- ఇండ్లు మంజూరుకాని వారి ఖాతాలో నిధులు జమ.. గ్రామ సెక్రటరీలను తొలగించాని ఆర్డర్స్
- లంచమడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 18005995991కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచన

**హైదరాబాద్, మహా:** పేదవాడి సొంతింటి కలను నెరవేర్చే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు ఇస్తోందని, చెల్లింపుల విషయంలో అవినీతికి పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సమస్యలు, సందేహాలకోసం గత వారం హౌసింగ్ కార్పొరేషన్‌లో ప్రారంభించిన కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో శుక్రవారం హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ విపి గౌతమ్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ఎడిజీ సంగ్రామ్ సింగ్ పాటిల్‌తో కలిసి మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఏ ఏ అంశాలపై కాల్ సెంటర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులను మంత్రి అడిగి తెలుసుకొని, తక్షణ చర్యలకు ఉపక్రమించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు లబ్ధిదారుల నుంచి లంచం అడిగే ఇందిరమ్మ కమిటీ సభ్యులను తక్షణం కమిటీ నుంచి తొలగించి, క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఖమ్మం, జగిత్యాల, కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇండ్లు మంజూరుకాని నలుగురికి వారి ఖాతాలో నిధులు జమచేసిన గ్రామ పంచాయితీ సెక్రటరీలను తక్షణమే సస్పెండ్ చేసి, సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ధికారులకు సూచించారు.

**లంచమడిగితే టోల్ ఫ్రీ నెంబర్..**

ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇంటి నిర్మాణ దశలను బట్టి ప్రతి సోమవారం నిధులు మంజూరు చేస్తున్నామని, అయితే కొన్ని బ్యాంకులు ఈ నిధులను



లబ్ధిదారుల ఖాతాలో జమచేసి పాత బకాయి కింద జమ చేసుకుంటున్నాయని, ఇటువంటి చర్యలను సహించేదిలేదని, సదరు బ్యాంకులపై చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీనిపై రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీకి లేఖ రాయాలని హౌసింగ్ ఎండీని ఆదేశించారు. ఆధార్ నెంబర్ ఆధారంగా చెల్లింపుల్లో ఎదురవుతున్న సమస్యలను ఈనెల 25వ తేదీలోగా పరిష్కరించి, దసరా పండగ లోపు చెల్లింపులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో పేదలను ఇబ్బందిపెట్టి, డబ్బుల వసూళ్లకు పాల్పడితే ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే చర్యలు తీసుకుంటామని, కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదును తక్షణం ఆయా జిల్లా కలెక్టర్, ఎస్పీకి పంపడంతోపాటు, సచివాలయంలోని తన కార్యాలయానికి కూడా పంపించాలని మంత్రి అధికారులకు సూచించారు. ఇటువంటి ఫిర్యాదులపై తమ కార్యాలయం కూడా మానిటరింగ్ చేస్తుందని తెలిపారు. లంచమడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 18005995991కు కాల్ చేసి వివరాలను తెలియజేస్తే, 24 గంటల్లో యాక్షన్ తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



### జూనియర్ ఎన్టీఆర్‌కు
# గాయం

- యాడ్ షూటింగ్‌లో ఘటన
- హైదరాబాద్‌లో వాణిజ్య ప్రకటన షూటింగ్
- ఎన్టీఆర్ ను వెంటనే ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చిన వ్యక్తిగత సిబ్బంది

**హైదరాబాద్, మహా:** టాలీవుడ్ అగ్ర హీరో జూనియర్ ఎన్టీఆర్ స్వల్పంగా గాయపడ్డారు. హైదరాబాద్ నగరంలో ఒక వాణిజ్య ప్రకటన చిత్రీకరణ జరుగుతుండగా ఆయన కాలికి స్వల్ప గాయమైంది. వెంటనే ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు. యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్న సమయంలో కిందపడటంతో గాయమైంది. వెంటనే వ్యక్తిగత సిబ్బంది ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. ఎన్టీఆర్‌కు చిన్న గాయమే అయిందని, అభిమానులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని చిత్ర పరిశ్రమ వర్గాలు తెలియజేస్తున్నాయి. ఎన్టీఆర్ అనారోగ్యంపై వచ్చే ఊహాగానాలను ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ క్షేమంగానే ఉన్నారని, కంగారు పడాల్సిన అవసరం ఏమీ లేదని ఆయన సన్నిహిత వర్గాలు కూడా చెబుతున్నాయి. ఈ విషయం తెలియడంతో అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

# నాపై ఇంటెలిజెన్స్ నిఘా
## కాంగ్రెస్‌లోనే ఉంటా.. రాజీనామా చేయను
### కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
### యెన్నం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలు సరైనవే

**హైదరాబాద్, మహా :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సొంత ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వం తనపై నిఘా పెట్టిందని, తన ప్రతి కదలికను ఇంటెలిజెన్స్ వర్గాలు గమనిస్తున్నాయని ఆయన ఆరోపించారు. తాను ఏం మాట్లాడినా రాష్ట్రంలో సంచలనమవుతోందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన కార్యకలాపాలపై ప్రత్యేకం దృష్టి సారించిందని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. తాను ఎక్కడికి వెళుతున్నది, ఏం చేస్తున్నా అనే విషయాలపై నిరంతరం నిఘా కొనసాగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తాను ఎలాంటి రాజకీయ నిర్ణయాలు తీసుకుంటానోనని ప్రభుత్వంలో ఆసక్తి నెలకొందని, అందులో భాగంగానే ఈ నిఘా ఏర్పాటు చేశారని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, తనపై ఎన్ని నిఘాలు పెట్టినా ప్రభుత్వం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. తాను ప్రస్తుతానికి ఎలాంటి చర్యలకు పాల్పడబోనని, ఎలాంటి నిర్ణయాలు తీసుకోనని తేల్చి చెప్పారు. తనపై అనవసరంగా దుష్ప్రచారం జరుగుతోందని అన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని, రాజీనామా చేయబోనని, పార్టీ మారనని, కొత్త పార్టీ పెట్టబోనని స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యే యెన్నం వాదన సరైందేనన్న రాజగోపాల్ రెడ్డి**

అసెంబ్లీ నియోజకవర్గంలోని స్థానిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాలంటూ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి చేసిన విజ్ఞప్తికి సంబంధించిన ఒక వార్తా కథనాన్ని రాజగోపాల్ రెడ్డి 'ఎక్స్' వేదికగా పంచుకుంటూ ఆయనకు మద్దతు తెలిపారు. యెన్నం చేసిన సూచనను మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నానని పేర్కొన్నారు. "మెజారిటీ ఎమ్మెల్యేల అభిప్రాయం కూడా ఇదే అని నేను భావిస్తున్నాను. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఉపయోగపడతాయి. సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, స్థానిక సమస్యల పరిష్కారానికి అవసరమైన మేరకు నిధులు కేటాయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అన్న వాస్తవాన్ని ముఖ్యమంత్రి గారు గుర్తించి వ్యవహరించాలి" అని ఆయన పేర్కొన్నారు.

# ఐఫోన్ తోపులాట

- ఉద్రిక్త పరిస్థితి... రంగంలోకి పోలీసులు
- మార్కెట్లో 17 సిరీస్ విక్రయాలు
- అర్ధరాత్రి నుంచే అనేకచోట్ల క్యూలు
- ప్రో మాక్స్ ధర 1,49,900 రూపాయలు
- మన దేశంలోనే ఎక్కువ ధరకు అమ్మకాలు



**న్యూఢిల్లీ, మహా :** యాపిల్ కంపెనీ కొత్తగా విడుదల చేసిన ఐఫోన్ 17 సిరీస్‌కు భారతదేశంలో భారీ స్పందన లభిస్తోంది. దేశవ్యాప్తంగా యాపిల్ స్టోర్లు, ఆన్‌లైన్ వెబ్‌సైట్లు, రిటైలర్ల వద్ద శుక్రవారం నుంచి అమ్మకాలు మొదలయ్యాయి. ఈ లాంచ్‌ను చూసేందుకు యాపిల్ స్టోర్ల ముందు జనాలు బారులు తీరారు. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ లలో తెల్లవారుజాము నుంచే క్యూలు కనిపించాయి. ముఖ్యంగా ముంబైలోని బీకేసీ జియో సెంటర్ వద్ద రాత్రి నుంచే ప్రజలు క్యూ కట్టారు. ఐఫోన్‌ల పట్ల భారతీయులకు ఉన్న ఉత్సాహాన్ని ఇది తెలియజేస్తుంది. కొన్నిచోట్ల తోపులాటలు కూడా జరిగాయి. దీనితో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. ఈ కొత్త ఫోన్‌లు కేవలం డిజైన్ మార్పులు మాత్రమే కాదు, కొత్త సాంకేతిక ఆవిష్కరణలతో ప్రపంచాన్ని ఆకట్టుకుంటున్నాయి.

### ఇండియాలోనే ధరలు అధికం

భారత మార్కెట్లో ఐఫోన్ 17 సిరీస్ ధరలు అమెరికా, దుబాయ్‌లతో పోలిస్తే కొంచెం ఎక్కువే. సాధారణ మోడల్ ధర 82,900 రూపాయల నుంచి ప్రారంభమవుతుంది. ఐఫోన్ 17 ఎయిర్ ధర 1,19,900 రూపాయలు, ప్రో మోడల్ 1,34,900, ప్రో మాక్స్ 1,49,900 రూపాయలుగా ఉంది. అయితే ఈఎంఐ, ఎక్స్ఛేంజ్ ఆఫర్ల ద్వారా వీటిని సులభంగా కొనుగోలు చేయవచ్చు. ఐఫోన్ 17 సిరీస్‌కు భారత్‌లో లభించిన ఆదరణతో దేశంలో యాపిల్ మార్కెట్ వృద్ధి మరింత పెరగనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

### వినూత్న ఫీచర్లు

ఐఫోన్ 17 సిరీస్‌లో నాలుగు మోడళ్లు ఉన్నాయి. సాధారణ ఐఫోన్ 17, అతి సన్నని ఐఫోన్ 17 ఎయిర్, ప్రీమియం ఐఫోన్ 17 ప్రో, ప్రో మాక్స్. ఈ సిరీస్‌లోని అన్ని మోడళ్లలో ఏ 19 ప్రాసెసర్‌ను అమర్చారు. ఇది మునుపటి మోడళ్ల కంటే రెండు రెట్లు వేగవంతం. అలాగే కెమెరాలన్నీ 48 మెగాపిక్సెల్ సెన్సార్లతో ఫోటోలు, వీడియోలను మరింత స్పష్టంగా తీయగలవు. వీటిలో ఐఓఎస్ 26 సాఫ్ట్‌వేర్ ఉంది. ఇది కృత్రిమ మేధస్సును ఉపయోగించి వాయిస్ అసిస్టెంట్‌ను మరింత తెలివిగా మారుస్తుంది. ఉదాహరణకు మీరు మాట్లాడుకునేటప్పుడు అది స్వయంచాలకంగా భాషలను అనువదిస్తుంది. ఈ సాంకేతికత భారత దేశంలోని వివిధ భాషలకు చాలా సహాయకరంగా ఉంటుంది.

### ఐఫోన్ 17 ఎయిర్ ప్రత్యేకత

ఐఫోన్ 17 ఎయిర్ మోడల్ మరింత ప్రత్యేకమైనది. కేవలం 6 మిల్లీమీటర్ల మందంతో ఇది చాలా సన్నగా ఉంటుంది. బ్యాటరీ లైఫ్‌పై సందేహాలు ఉన్నప్పటికీ... రోజువారీ ఉపయోగాలకు ఇది చాలా అనుకూలంగా ఉంటుంది. ఈ కొత్త ఫీచర్లు భారతీయ వినియోగదారుల రోజువారీ జీవితాన్ని సులభతరం చేస్తాయని యాపిల్ చెబుతోంది. ముఖ్యంగా కొత్త ఫోన్లన్నీ శాటిలైట్ కనెక్టివిటీతో మారుమూల ప్రాంతాల నుంచి కూడా కాల్ చేయగలిగే అవకాశం ఉంది.

### త్వరలోనే
# టూరిజం కాన్‌క్లేవ్
## పర్యాటకంలో పెట్టుబడులే లక్ష్యం
### ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్‌లో మంత్రి జూపల్లి

(మొదటిపేజీ తరువాయి)

పర్యాటకం కేవలం వినోదం కాకుండా ఉపాధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త టూరిజం పాలసీ ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నదన్నారు. వివిధ వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులతో ముందుకు రావాలనుకునే యువ పారిశ్రామికవేత్తలకు ఇది విస్తృతమైన అవకాశాలను కల్పిస్తుందని, టూరిజం రంగంలో పెట్టుబడులు పెట్టండి. వారికి పూర్తిగా మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి, తెలంగాణలోనే త్వరలో ఒక ఉన్నత స్థాయి టూరిజం కాంక్లేవ్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం చర్చలకు, పెట్టుబడి ప్రణాళికలకు, వ్యూహాత్మక భాగస్వామ్యాలకు ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తుందని వెల్లడించారు.

ప్రపంచస్థాయి పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన అన్ని వనరులు తెలంగాణలో ఉన్నాయని, అయితే తెలంగాణ పర్యాటకానికి అనుకున్న స్థాయిలో ప్రచారం లభించడకపోవడమే అసలైన లోటన్నారు. మీరు మా రాష్ట్రాన్ని అన్వేషించేటప్పుడు, మా పర్యాటక అవకాశాలను ప్యాకేజ్ చేయటంలో భాగస్వాములు కావాలని, తెలంగాణకు బ్రాండ్ అంబాసడర్లుగా నిలవాలని టూరిజం, ట్రావెల్స్, హస్పిటాలిటీ ఎగ్జిబిటర్లు, ప్రతినిధులకు మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 21 నుంచి 30 వరకు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతాయని, బతుకమ్మ వేడుకలను చారిత్రక వేయి స్తంభాల గుడి వద్ద ప్రారంభిస్తున్నామని, ఈ పూల పండుగను ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా ఆస్వాదించి, దాని వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని కోరారు.

# పోలవరం పనుల్లో గిన్నిస్ రికార్డు సృష్టించాం
## డిసెంబర్ 25 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం: సీఎం చంద్రబాబు

**అమరావతి, మహా:** నీటిని సమర్థంగా నిర్వహిస్తే కరవు అనే మాట రాదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పూర్తిగా తిరోగమనంలో పయనించిందని, విధ్వంసంతో పరిపాలన ప్రారంభించిన వారు విధ్వంసంతోనే చరిత్రలో నిలిచిపోయారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. జగన్ చేతకాని పాలనలో పోలవరం పనులు రివర్స్ అయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో నీటి సమర్థ నిర్వహణపై శాసనసభలో జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. గత పాలకుల అసమర్థత, అహంకారం వల్లే రూ. 400 కోట్లతో నిర్మించిన పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని ఆరోపించారు. కాంట్రాక్టర్లను మార్చవద్దని కేంద్ర జలసంఘం సూచించినా పెడచెవిన పెట్టడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని అన్నారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌ను 2025 డిసెంబరు నాటికి పూర్తి చేసి, పోలవరానికి పూర్వ వైభవం తీసుకొస్తామని చంద్రబాబు సభకు హామీ ఇచ్చారు. సాగునీటి రంగంపై తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని వివరిస్తూ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్లక్ష్యాన్ని గణాంకాలతో సహా ఎత్తిచూపారు. 201419 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులపై రూ. 68,417 కోట్లు ఖర్చు చేస్తే, 201924 మధ్య వైసీపీ ప్రభుత్వం కేవలం రూ. 28,376 కోట్లు మాత్రమే వెచ్చించిందని విమర్శించారు.



ఇది వారి చేతకానితనానికి నిదర్శనం..

తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఒక్క ఏడాదిలోనే బడ్జెట్‌లో రూ. 12,454 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. టీడీపీ హయాంలో 72 శాతం పూర్తయిన పోలవరం పనులను, గత ఐదేళ్లలో కేవలం 3.84 శాతం మాత్రమే ముందుకు తీసుకెళ్లారని, ఇది వారి చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలోని నదుల అనుసంధానం ద్వారానే శాశ్వత నీటి భద్రత సాధ్యమని తాను బలంగా నమ్ముతానని చంద్రబాబు పునరుద్ఘాటించారు. దేశంలోనే తొలిసారిగా గోదావరికృష్ణా నదులను అనుసంధానం చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. రానున్న కాలంలో రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం చేసి, ప్రతి ఎకరాకు నీరందిస్తామని స్పష్టం చేశారు. ఒకప్పుడు రాయలసీమలో వేరుశనగ వేసిన రైతులకు పెట్టుబడి కూడా రాని దుస్థితి ఉండేదని, తాము అధికారంలో ఉన్నప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ సమస్యతో అల్లాడుతుంటే, శ్రీశైలం ఎడమగట్టు కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా నీరందించి ఆ సమస్యను పరిష్కరించిన చరిత్ర తమదేనని చెప్పారు.

**చంద్రబాబు భావోద్వేగం..**

ఈ ఏడాది దేవుడి దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రంలోని జలాశయాలు 94 శాతం నిండాయని, సమర్థవంతమైన నీటి నిర్వహణతో భూగర్భ జలాలు కూడా పెరిగాయని సీఎం హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలందరూ తమ నియోజకవర్గాల్లో భూగర్భ జలాలను పెంచే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. దివంగత ఎన్టీఆర్ సంకల్పించిన హంద్రీనీవా కాలువ ద్వారా 738 కిలోమీటర్ల దూరం నీటిని తరలించి, తన నియోజకవర్గమైన కుప్పం ప్రజల రుణం తీర్చుకున్నానని చంద్రబాబు భావోద్వేగంతో ప్రస్తావించారు. రూ. 3,800 కోట్లతో 468 చెరువులను నింపే కార్యక్రమం కొనసాగుతోందని వివరించారు. రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపితేనే తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తానని స్పష్టం చేయడం వల్లే, నాడు ప్రధాని మోదీ సహకారంతో ఆ ప్రాజెక్టు ఈ స్థాయికి వచ్చిందన్నారు.



ఘనంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

# జన్మదిన వేడుకలు

ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ..
దేవాలయాలు, దర్గాలలో ప్రత్యేక ప్రార్థనలు


**పటాన్ చేరు మహా :** శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానుల, కార్యకర్తలు పటాన్ చేరులో ఘనంగా నిర్వహించారు. జిఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో పటాన్ చేరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మార్కెట్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో మూడుసార్లు ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన గూడెం మహిపాల్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు అభిలాషించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పోరేటర్ పుష్ప నగేష్, రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, షకీల్, మైనార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నో ఫ్లై జోన్‌గా తెలంగాణ సెక్రటేరియట్

డ్రోన్ ఎగరవేస్తే చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరిక

నకిలీ ఉద్యోగుల బెడద, బెదిరింపు నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ సచివాలయాన్ని ప్రభుత్వం నో ఫ్లై జోన్‌గా ప్రకటించింది. సచివాలయం చుట్టూ నో ఫ్లై జోన్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్రటేరియట్ పై, చుట్టూ డ్రోన్ ఎగరవేస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. రాష్ట్ర సచివాలయంలో భద్రత పెంచేందుకు ఇప్పటికే కొత్త సీసీ కెమెరాలు అమర్చారు. మొత్తం 310 కెమెరాలు అక్కడ ఏర్పాటు చేయబడ్డాయి. ఇదివరకు ఉన్న 60 కెమెరాలకు అదనంగా 250 కొత్త కెమెరాలు జోడించి భద్రతా పర్యవేక్షణను మరింత పెంచారు. సచివాలయానికి నకిలీ ఉద్యోగుల బెడద, భద్రతపరమైన బెదిరింపు ఫోన్ల వంటి వాటి నేపథ్యంలో సచివాలయ భద్రతను కట్టుదిట్టం చేశారు. తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్) పర్యవేక్షణలో నిఘా, భద్రత కొనసాగుతుంది. తెలంగాణ స్పెషల్ పోలీసులకు నుంచి తిరిగి టీజీఎస్పీఎఫ్ పరిధిలోకి సచివాలయం భద్రత విధులు వచ్చాక..214 మంది సిబ్బంది విధుల్లో ఉన్నారు.



# అక్టోబర్ నుంచే పత్తి సేకరణకు ఏర్పాట్లు

- రైతుల ప్రయోజనాల దృష్ట్యా సీసీఐ సమర్థవంతంగా చేపట్టాలి
- రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను 110 నుంచి 122కి పెంచాం
- రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పత్తి సీజన్ ప్రారంభంపై సీసీఐ ఉన్నతాధికారులతో మంత్రి రివ్యూ




**హైదరాబాద్, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా 202526 పత్తి మార్కెటింగ్ సీజన్ ప్రారంభంపై రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పత్తి ఉత్పత్తి, మార్కెట్ ధరల పరిస్థితి, ఎంఎస్పీ అమలు, రైతులకు చెల్లింపులు, జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాట్లు, రవాణా సమస్యలు, డిజిటలైజేషన్, రైతుల రిజిస్ట్రేషన్, స్థానిక కమిటీలు, ఫిర్యాదు పరిష్కారం వంటి అనేక అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది. సీసీఐ ప్రతినిధులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో పత్తి సేకరణలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని, దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం కొన్ని నూతన విధానాలు ప్రవేశపెట్టామని అన్నారు. దానికి తగ్గట్టుగా ప్రభుత్వ సహాయం అందించాలని మంత్రిని కోరారు. క్వింటాల్‌కు రూ.1099 తక్కువగా ఉన్నాయి.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో పండే పత్తి ప్రత్యేక నాణ్యత కలిగినదని మంత్రి వివరించారు. ప్రస్తుతం మార్కెట్ ధరలు ఎంఎస్పీ కంటే క్వింటాల్‌కు రూ.1099 తక్కువగా ఉన్నాయని, ఇది రైతులకు ఆందోళన కలిగిస్తున్నదని పేర్కొన్నారు. కాబట్టి రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు సీసీఐ సమర్థవంతంగా కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. అక్టోబర్ నెల నుంచే పత్తి సేకరణకు ఏర్పాట్లు చేసుకోవాలని, రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను 110 నుంచి 122కి పెంచినట్లు మంత్రి వెల్లడించారు. అదనంగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్తగా కొనరావుపేట ఏఎంసీ కేంద్రాన్ని కూడా చేర్చాలని సూచించారు. రైతులు తమ పత్తిని సులభంగా విక్రయించుకునేందుకు జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ మిల్లులు, గోదాములు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రైతులకు ఎంఎస్పీ చెల్లింపులు పూర్తిగా ఆధార్ ఆధారిత ధృవీకరణ తర్వాతే, నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి అన్నారు. దీంతో రైతులకు పారదర్శకంగా, ఆలస్యం లేకుండా చెల్లింపులు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

# ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో ఏబీవీపీ ఘన విజయం

విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా ఆర్యన్ మాన్ విజయం.. అభినందించిన అమిత్ షా, జేపీ నడ్డాలు



**న్యూఢిల్లీ, మహా :** ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ (డీయూఎస్ యూ) ఎన్నికల్లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) అభ్యర్థి ఆర్యన్ మాన్ విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు శుక్రవారం ఉదయం 8 గంటలకు నార్త్ క్యాంపస్‌లోని కమ్యూనిటీ సెంటర్‌లో భారీ భద్రత మధ్య ప్రారంభమైంది. 20 రౌండ్ల ఓట్ల లెక్కింపు ముగిసే సమయానికి, మాన్ తన ఖాతాలో 28,821 ఓట్లు సాధించగా, ఎన్ఎస్‌యూఐ అధ్యక్ష అభ్యర్థి జోస్లిన్ నందితా చౌదరి కేవలం 12,645 ఓట్లు మాత్రమే దక్కాయి. దీంతో ఏబీవీపీ అభ్యర్థి 16,000 కు పైగా ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. వామపక్షాల విద్యార్థి సంఘాలు బలపరచిన అంజలికి 5,385 ఓట్లు మాత్రమే వచ్చాయి. అధ్యక్ష పదవితో పాటు, ఏబీవీపీ కార్యదర్శిగా కునాల్ చౌదరి, సంయుక్త కార్యదర్శి దీపికా ఝా పదవులను కూడా కైవసం చేసుకున్నారు. అయితే, ఎన్ ఎస్ యు ఐ అభ్యర్థి రాహుల్ ఝన్స్లా యాదవ్ 29,339 ఓట్లను సాధించడంతో ఉపాధ్యక్ష పదవిని కైవసం చేసుకున్నారు. కార్యదర్శి పదవిని ఏబీవీపీకి చెందిన కునాల్ చౌదరి 23,779 ఓట్లతో గెలుచుకున్నారు. ఎన్ఎస్ యుఐకి చెందిన కబీర్ 9,525 ఓట్లతో చాలా వెనుకబడి ఉన్నారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అభ్యర్థి అభినందన 9,535 ఓట్లను సాధించింది. కాగా ఏబీవీపీకి చెందిన దీపిక ఝా 21,825 ఓట్లతో జాయింట్ సెక్రటరీ పదవిని గెలుచుకోగా, ఎన్ఎస్ యుఐకి చెందిన లవ్ కుష్ బధాన 17,380 ఓట్లను సాధించారు. వామపక్ష కూటమి అభ్యర్థి అభిషేక్ 8,425 ఓట్లను సాధించారు గత సంవత్సరం ఎన్ఎస్ యుఐ అభ్యర్థి రోనక్ ఖత్రి అధ్యక్ష పదవిలో విజయం సాధించారు. కాంగ్రెస్ మద్దతు గల సంస్థ సంయుక్త కార్యదర్శి పదవిని కూడా కైవసం చేసుకుంది. ముందుగా, ఈవీఎంల లెక్కింపు ప్రారంభమయ్యే ముందు, అన్ని ప్రధాన విద్యార్థి సంఘాల అభ్యర్థులు, ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సిబ్బంది స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచారు.




# హెచ్ఎండీఏకు షాక్

- బాచుపల్లి ప్లాట్ల వేలంలో ఒక్క ప్లాటు కూడా అమ్ముడుపోని వైనం
- అత్యధికంగా గజం రూ.70,000 నిర్ణయించడంతోనే స్పందించని వినియోగదారులు
- రియల్ భూం లేకపోవడమే కారణం

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) షాక్ కు గురైంది. బాచుపల్లిలో తమ సంస్థకు చెందిన 70 ప్లాట్లు వేలం వేయగా, ఒక్కటి కూడా అమ్ముడుపోకపోవడంతో అధికారులు అవాక్కయ్యారు. గజం ధర రూ. 70,000 నిర్ణయించడంతోనే ఎవరూ ఆసక్తి చూపలేదని పలువురు సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. మరోవైపు తుర్కయాంజల్ ప్రాంతంలో 12 ప్లాట్లు వేలం వేయగా, కేవలం 2 ప్లాట్లు మాత్రమే అమ్ముడుపోవడంతో తీవ్ర నిరాశలో హెచ్ఎండీఏ అధికారులున్నారు. అధిక ధరలే కారణమని కొందరు, ప్రభుత్వ సంస్థలపైన నమ్మకం కోల్పోవడమే కారణమని విమర్శిస్తున్న మరికొందరు విశ్లేషకులు. అయితే గత కొంత కాలంగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా భూముల ధరలు భారీగా తగ్గడం, క్రయ విక్రయాలు తగ్గడం కూడా మరో కారణమని అంటున్నారు. ఏది ఏమైనా ప్లాట్ల విక్రయం ద్వారా రాష్ట్ర ఖజానాకు కాసులను కురిపించాలనుకున్న హెచ్ ఎండీఏ తాజా పరిణామంతో అవాక్కవుతోంది.



# టీడీపీలో చేరిన ఎమ్మెల్సీలు

రాజశేఖర్, కల్యాణ చక్రవర్తి, పద్మశ్రీ

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

**అమరావతి, మహా :** ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, బల్లి కళ్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సీఎం సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నేతలకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు సునీల్, విజయశ్రీ, పులివర్తి నాని, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, అనురాధ, చిరంజీవి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, బీటీ నాయుడు, రామ్‌గోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణ రాజు, ఫారెస్ట్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణరంగారావు, తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట పూజల కేసులో హైకోర్టుకు హరీశ్‌రావు

కౌంటర్లు దాఖలు చేయాలని ఈవో, పోలీసులకు హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, మహా :** తనపై నమోదైన మూడు వేర్వేరు క్రిమినల్ కేసులను కొట్టివేయాలని కోరుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై న్యాయస్థానం విచారణ చేపట్టింది. గతంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో హరీశ్‌రావు 'పాప పరిహార పూజలు' నిర్వహించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. రుణమాఫీ హామీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రిలో చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ హరీశ్‌రావు ఈ పూజలు చేశారు. అయితే, ఆలయ నిబంధనలను ఉల్లంఘించి, గుడిలో రాజకీయ కార్యక్రమం నిర్వహించారని ఆరోపిస్తూ ఆలయ ఈవో భాస్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతపై కేసు నమోదు చేశారు. ఈ కేసును రద్దు చేయాలని హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ కె. లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం, ఈ వ్యవహారంలో కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను, ఆలయ ఈవోను ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 14వ తేదీకి వాయిదా వేసింది. ఇక, బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మరో కేసులోనూ హరీశ్‌రావుకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. హరీశ్‌రావు, ఆయన అనుచరులు తనను బెదిరించారంటూ చక్రధర్‌గౌడ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, తదుపరి విచారణను అక్టోబర్ 8కి వాయిదా వేసింది. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకుడు మెట్టు సాయి ఫిర్యాదుతో కరీంనగర్‌లో నమోదైన కేసును కూడా రద్దు చేయాలని హరీశ్‌రావు మరో పిటిషన్ వేశారు. అయితే, ఈ కేసులో దర్యాప్తు ఇప్పటికే పూర్తయి ట్రయల్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలైనందున, నేరుగా ఆ చార్జ్‌షీట్‌ను సవాల్ చేస్తూ కొత్తగా పిటిషన్ దాఖలు చేసుకోవాలని హరీశ్‌రావుకు హైకోర్టు సూచించింది.

# కూర్చోబెట్టి సమస్యను చెబుతాం

- ప్లాస్టిక్ నిషేధంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పిస్తాం
- కాలుష్య నియంత్రణ బాధ్యత పరిశ్రమలదే కాదు.. ప్రజలు, అధికారులది కూడా
- ప్లాస్టిక్ నిషేధంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమాధానం



**అమరావతి, మహా:** రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం ఉందని.. క్షేత్రస్థాయిలో అది సరిగా అమలు జరగడం లేదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రశ్నకు పవన్ సమాధానం ఇచ్చారు. 'ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి చాలా నష్టం జరుగుతోంది. అసెంబ్లీలో కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు జరగడం లేదు. ఫ్లెక్సీలను కూడా నిషేధించాలి. కానీ.. చాలా మంది ఉపాధి కోల్పోతారని ఆలోచిస్తున్నాం. బయోడీగ్రేడబుల్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నాం. ప్లాస్టిక్ నిషేధంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. అసెంబ్లీలో ఈ అంశంపై పూర్తిస్థాయి చర్చ జరగాలి. ఉప్పలపాడు పక్షుల కేంద్రం విషయంలో చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వం కాలుష్య నియంత్రణ బోర్డు (పీసీబీ)లో ఎవరినీ నియమించలేదు. కాలుష్య నియంత్రణ స్థానిక సంస్థలతో సంబంధమున్న అంశం. పీసీబీలో ప్రత్యేకంగా ఉద్యోగులు లేరు. రాంకీ సంస్థకు షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకున్నాం. వెంటనే చర్యలు తీసుకుంటే చాలా కుటుంబాలు రోడ్డున పడతాయి. కాలుష్య నియంత్రణ బాధ్యత పరిశ్రమలదే కాదు.. ప్రజలు, అధికారులది కూడా. రాంకీపై నిర్ణయం తీసుకుంటే గత ప్రభుత్వంలా కక్ష సాధింపు అనే ప్రచారం జరిగే ప్రమాదముంది. పారిశ్రామికవేత్తలను భయపెట్టడం మా ఉద్దేశం కాదు.. కూర్చోబెట్టి సమస్యను చెబుతాం. గతం ప్రభుత్వంలా ఇప్పుడు జరగదు' అని పవన్ అన్నారు.

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO: APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు
కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919

మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?
జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం
ANN SCHOOL OF JOURNALISMలో
జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.
గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు
ఇదే మా ఆహ్వానం
అడ్మిషన్లు ప్రారంభమైనవి
అప్లికేషన్‌కు ఆఖరుతేదీ - సెప్టెంబర్ 21
తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 28
పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన
మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు

HURRY UP! LIMITED TIME
త్వరపడండి...
8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు
కోర్సు పూరైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును
మెరిట్ స్టూడెంట్స్ కు ఇంటర్న్ షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్
FOR ADMISSIONS CONTACT:
+91 74369 39999
SCAN ME
APPLY ON OUR OFFICIAL WEBSITE:
WWW.ANNSCHOOLOFJOURNALISM.COM

# బీహార్‌లో ఎన్డీఏ – మహాఘట్ బంధన్

# నువ్వా నేనా..?

పీపుల్స్ పల్స్ సర్వే

BIHAR ELECTION SPECIAL

జాతీయ స్థాయిలో బీహార్ రాష్ట్ర రాజకీయాలకు ప్రత్యేకత ఉంటుంది. దశాబ్దాలుగా సంకీర్ణ ప్రభుత్వాలకు కేంద్రంగా ఉన్న బీహార్ రాష్ట్రంలో ఏయే పార్టీలు ఎప్పుడు ఏ కూటమిలో ఉంటాయో..? ఎప్పుడు ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటుందో అంచనా వేయడం తేలిక కాదు. నిత్యం అనిశ్చిత రాజకీయాలకు కేరాఫ్గా ఉండే బీహార్లో త్వరలో జరగబోయే రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఎన్డీఏ, 'ఇండియా' కూటముల మధ్య తీవ్ర పోటాపోటీ నెలకొని ఉందని క్షేత్రస్థాయిలో పరిస్థితులు వెల్లడిస్తున్నాయి. పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ, సౌత్ ఫస్ట్ మీడియా సంస్థ సంయుక్తంగా బీహార్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాభిప్రాయం కోసం మూడ్ సర్వే నిర్వహించగా ప్రస్తుతం ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని అధికార ఎన్డీఏ ప్రతిపక్ష 'ఇండియా' కూటమిపై స్వలంగా కేవలం ఒక్క శాతం ఓట్ల ఆధిపత్యం కనబరుస్తుందని వెల్లడి కావడంతో ఎన్నికల సమయానికి ఫలితం ఎటైనా మారవచ్చు.

2025 అక్టోబర్ లేదా నవంబర్లో జరిగే శాసనసభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 41 నుండి 44 శాతం, 'ఇండియా' కూటమికి 40 నుండి 42.5 శాతం ఓట్లు వచ్చే అవకాశాలున్నాయని మూడ్ సర్వేలో తేలింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ 30 నుండి 31 శాతం ఓట్లతో, బీజేపీ 28 నుండి 29 శాతం ఓట్లతో ఆధిపత్యం కనబరుస్తూ వారి కూటముల్లో కీలక పాత్ర పోషించనున్నాయి. రెండు కూటముల మధ్య నువ్వా నేనా అన్నట్టు పోటాపోటీగా ఉండబోతున్న బీహార్ ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన్ సురాజ్ పార్టీ (జేఎస్పీ) 6 నుండి 8 శాతం ఓట్లతో నిర్ణయాత్మక పాత్ర పోషించనుంది. ఇతరులు 7.5 నుండి 9 శాతం ఓట్లు పొందే అవకాశాలున్నాయి. ఈ గణాంకాల్లో 3 శాతం ప్లస్/మైనస్ ఉండే అవకాశాలున్నాయి. కుల రాజకీయాలకు పెట్టింది పేరైన బీహార్ లో స్థానిక సమస్యలు, సంక్షేమ హామీలు, పార్టీలలో అసంతృప్తులు ఎన్నికల్లో ప్రభావం చూపనున్నాయి.

బీహార్ లో 2020 శాసనసభ ఎన్నికల్లోనూ ఎన్డీఏ, మహాఘట్ బంధన్ కూటములు పోటాపోటీగా తలపడి చెరో 37 శాతం ఓట్లు సాధించాయి. గత ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా రెండు కూటముల మధ్య ఓట్ల వ్యత్యాసం సుమారు 11 వేలు మాత్రమే. ఆర్జేడీ 75 స్థానాలతో మొదటి స్థానంలో నిలవగా, బీజేపీ 74 స్థానాలతో ఒక్క సీటు తేడాతో రెండో స్థానంలో నిలిచింది.

సంక్లిష్ట రాజకీయాలకు నెలవైన బీహార్ లో గతంలో వలే మరోసారి ఎన్డీఏ, మహాఘట్ బంధన్ కూటముల మధ్యనే ప్రధాన పోటీ ఉండనుంది. బీజేపీ, జేడీ (యూ), హెచ్ఏఎమ్, ఎల్జేపి (ఆర్వీ), ఆర్ఎల్ఎమ్ పార్టీలతో కూడిన అధికార ఎన్డీఏ కూటమి రాష్ట్రంలోని అగ్రవర్ణాలు, ఈబీసీ, దళిత వర్గాల ఓట్లపై భారీ ఆశలు పెట్టుకుంది. జాతీయ స్థాయిలో 'ఇండియా' కూటమిగా చెలామణి అవుతూ బీహార్లో మహాఘట్ బంధన్ పేరుతో ప్రతిపక్షాలు గట్టి పోటీ ఇస్తున్నాయి. కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాలు, వికశీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) పార్టీలతో కూడిన 'ఇండియా' (మహాఘట్ బంధన్) కూటమి రాష్ట్రంలోని యాదవ, ముస్లిం సామాజిక వర్గాల్లో పటిష్టంగా ఉంది. వీరితో పాటు ఓబీసీ వర్గాల్లో పట్టు కోసం ప్రయత్నిస్తోంది. గతంలో 'మార్పు' (2005), 'సుశాసన్' (2010),ఉద్యోగాలు (2020) నినాదాలతో రాష్ట్రంలో ఎన్నికలు జరగ్గా, ఈ సారి ఎలాంటి ప్రత్యేక నినాదం లేకుండా ప్రభుత్వ వ్యతిరేకత, సంక్షేమ పథకాలు, కుల సమీకరణాలతో పాటు నూతన పార్టీ జేఎస్పీ ఎన్నికల్లో ప్రభావం చూపనున్నాయి.

రాష్ట్రంలో ధరల పెరుగుదల, వలసలు, నిరుద్యోగం అంశాలపై ఉన్న వ్యతిరేకతను సంక్షేమం, అభివృద్ధి అంశాలు తగ్గించడం ఎన్డీఏకు కలిసివస్తోంది. 'జీవికా' పథకంలో భాగస్వాములైన మహిళలు మద్య నిషేధం, విడో పింఛన్లు, సబ్సిడీలతో నితీశ్ కుమార్ పట్ల ఆకర్షితులవుతున్నారు. ఆశించిన ఉద్యోగాలు రాలేదని యువత విమర్శిస్తున్నా గత 'జంగిల్ రాజ్' కంటే నితీశ్ ప్రభుత్వంలో స్థిరత్వం ఉందని అంగీకరిస్తున్నారు. రైతులు కులాల ఆధారంగా చీలిపోయారు. ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) వంటి జాతీయ అంశాల కన్నా స్థానిక అంశాలే ఈ ఎన్నికల్లో కీలకం కానున్నాయని మూడ్ సర్వేలో వెల్లడైంది.

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా స్థానిక అంశాలకే పెద్దపీట దక్కనుంది. తమ ఎమ్మెల్యేల పని తీరుతో పాటు స్థానిక సమస్యల ఆధారంగానే ఓటు వేస్తామని చాలా మంది మూడ్ సర్వేలో చెప్పారు. బీహార్ ఎన్నికల్లో ఎప్పటిలా ఈ సారి కూడా సామాజిక కులాలే కీలకం కానున్నాయి. రెండు ప్రధాన కూటముల్లో పార్టీల మధ్య సీట్ల కేటాయింపులు, పార్టీల అభ్యర్థుల ఎంపికలో సామాజిక అంశాలకే ప్రాధాన్యత ఉండనుంది. అభ్యర్థుల ఎంపిక తర్వాతే ఎవరికి ఓటు వేయాలో నిర్ణయిస్తామని ఓటర్లు చెప్పారు. ఎన్డీఏకు మద్దతుగా ఉన్న ఈబీసీ ఓటర్లు తమ సామాజిక వర్గం వారికి మహాఘట్ బంధన్ టికెట్లిస్తే వారికి ఓటు వేయడానికి వెనుకాడమని చెప్పారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో ఉత్తర ప్రదేశ్లో అఖిలేశ్ యాదవ్ పీడీఏ (పిచ్చడ్, దళిత్, అల్పసంఖ్యాక్) వ్యూహం విజయవంతమైనా, బీహార్లో తేజస్వీ యాదవ్ ఎమ్వై (ముస్లిం, యాదవ్) వ్యూహం విఫలమైంది. టికెట్ల కేటాయింపులో కీలకమైన సామాజిక సమీకరణలను విజయవంతంగా నిర్వహించలేకపోతే పార్టీల్లో అసంతృప్తి పెరిగే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ బీహార్ లో చేపట్టిన 'ఓట్ అధికార్ యాత్ర' ప్రజాకర్షణగా నిలిచింది. అయితే ఈ యాత్ర ద్వారా రాష్ట్రంలో రెండు కూటములకు మద్దతిచ్చే సామాజిక సమీకరణాల్లో పెద్ద మార్పు కనిపించలేదు.

సామాజిక సమీకరణాలను పరిశీలిస్తే రాష్ట్రంలో 15.5 శాతం ఉన్న అగ్రవర్ణాల్లో 3 శాతం బ్రాహ్మణులు, 3.4 శాతం రాజ్పుత్లు, 2.8 శాతం భూమిహార్లు, 0.6 శాతం కాయస్తులు బీజేపీకి మద్దతిస్తున్నారు. బీహార్ లో 14.2 శాతం ఉన్న యాదవ్ లు ఆర్జేడీ వెంట ఉన్నా మతం ఆధారంగా మిథిలా, సీమంచల్ లో బీజేపీకి కొంత యాదవ్ల మద్దతు లభిస్తోంది. 2.8 శాతం ఉన్న కుర్మీలు, 4.2 శాతం ఉన్న కుష్వాహాలు దక్షిణాన నితీశ్ వెంట ఉన్నా, ఉత్తరాదిన చీలిక కనిపిస్తోంది. రాష్ట్రంలో కీలకమైన 36 శాతం ఉన్న ఈబీసీలు జేడీ(యూ), బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. వీరిలో నిశాద్ సామాజికవర్గం ఉపకులాలు ప్రాంతాల వారీగా ఎన్డీఏ, వీఐపీ వైపు ఉన్నారు. 19.65 శాతం ఉన్న షెడ్యుల్ కులాలు, 5 శాతం ఉన్న చమార్లు ఆర్జేడీ,కాంగ్రెస్, వామపక్షాల వైపు, 5 శాతమున్న పాశ్వాన్ లు ఎల్జీపీ (ఆర్వీ) వైపు ఉండగా 3 శాతం ఉన్న ముషార్లు ప్రాంతాల వారీగా చీలిపోయారు. 1.68 శాతం ఉన్న షెడ్యూల్ తెగల ఓట్లు రెండు కూటముల మధ్య చీలిపోతున్నాయి. బీహార్ లో 17.7 శాతం ఉన్న ముస్లింలు మహాఘట్ బంధన్ కు పటిష్టమైన ఓటు బ్యాంకుగా నిలుస్తున్నారని పీపుల్స్ పల్స్ సర్వేలో తేలింది. సీమాంచల్ ప్రాంతంలో ఏఐఎంఐఎం పార్టీకి కొంత ముస్లింల మద్దతు లభిస్తోంది.




బీహార్ లో ఏఐఎంఐఎం కీలక పాత్ర పోషిస్తోంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఆరు స్థానాల్లో గెలిచినా కిషన్గంజ్ లోక్ సభ నియోజవర్గంతో పాటు సమీపంలో ఉన్న అరారియాకే పరిమితమైంది. గెలిచిన ఆరుగురు ఎమ్మెల్యేలలో ఐదుగురు ఆర్జేడీలో చేరడంతో ఏఐఎంఐఎం బలహీనపడింది. అయితే వక్ఫ్ సవరణ బిల్లుపై ఆ పార్టీ ఉద్యమంతో ఆ పార్టీ కొన్ని ప్రాంతాల్లో పట్టు సాధించింది. వక్ఫ్ చట్టంపై ఓవైసీ పోరాడుతున్నారనే అభిప్రాయం సీమంచల్ లో ముస్లిం యువత భావిస్తోంది. అయితే రాహుల్ గాంధీ యాత్రతో ఏఐఎంఐఎంకు ముస్లింలలో మద్దతు తగ్గుతోందని సర్వేలో తేలింది. 'ఇండియా' గ్రూపులో చేర్చుకోవాలని ఏఐఎంఐఎం కోరుతున్నా కాంగ్రెస్, ఆర్జేడీ నుండి ఆశించన స్పందన రాలేదు. కిషన్గంజ్ తో పాటు పూర్ణియా, అరారియా వంటి ముస్లిం ప్రభావిత ప్రాంతాల్లో మద్దతు లభిస్తుండడంతో పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేసినా ఏఐఎంఐఎం 1 నుండి 3 స్థానాల్లో గెలవవచ్చని మూడ్ సర్వేలో తేలింది.

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఎన్నికల్లో కీలకంగా మారి ప్రభుత్వ వ్యతిరేకత బయటపడకుండా చేస్తున్నాయి. ఎన్డీఏ, మహాఘట్ బంధన్ కూటములు బీహార్ లో పోటాపోటీగా హామీలిస్తున్నాయి. నితీశ్ ప్రభుత్వం 1.67 కోట్ల కుటుంబాలకు 125 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీ ఇవ్వడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో కుటుంబానికి నెలకు రూ.200 నుండి 300 మేర విద్యుత్ బిల్లులు తగ్గుతాయి. మహిళల కోసం 'ముఖ్యమంత్రి మహిళా రోజ్గార్ యోజన' పథకం కింద రూ.10 వేలు ఉపాధి ప్రోత్సాహకం, మహిళా స్వయం సహాయక సంఘాలకు తక్కువ వడ్డీకి రూ.2 లక్షల రుణాలిస్తామని ఎన్డీఏ హామీ ఇచ్చింది. బీహార్ రాష్ట్రంలో 12 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్న ఎన్డీఏ మరో కోటి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో ట్రైబెల్స్ కు భూమి హక్కులు కల్పిస్తామని ఎన్డీఏ హామీ ఇచ్చింది.

ఎన్డీఏ హామీలకు పోటీగా మహాఘట్ బంధన్ కూటమి కూడా బీహార్ ప్రజలకు భారీ హామీలిచ్చింది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ప్రతి మహిళకు నెలకు రూ.2500, రాష్ట్రంలో వలసల నివారణకు స్థానికులకు 100 శాతం ఉద్యోగాలు, ప్రతి పంచాయతీలో ఐటీఐ ఏర్పాటు చేస్తామని ఆర్జేడీ హామీలిచ్చింది. అన్ని రంగాల్లో మహిళా కోటా కల్పించి, వారికి భద్రత ఇస్తామని మహాఘట్ బంధన్ హామీ ఇచ్చింది. ఈ రెండు కూటములకు పోటీగా జేఎస్పీ పంచాయత్ స్కూల్స్, యువతకు ఉద్యోగాలు, వృద్ధులకు రూ.2000 పింఛన్, మహిళలకు రుణాలు హామీలిస్తూ, రాష్ట్రంలో అవినీతి నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటామని చెబుతోంది.

శాంతి భద్రతల అంశానికి సంబంధించి బీహార్ లో ఆర్జేడీ గెలిస్తే రాష్ట్రంలో మళ్లీ 'జంగిల్ రాజ్' వస్తుందని ఎన్డీఏ మద్దతుదారులు ప్రచారం చేస్తుండగా, నితీశ్ పాలనలో రాష్ట్రంలో అవినీతి, నేరాలు పెరిగిపోయాయని మహాఘట్ బంధన్ మద్దతుదారులు విమర్శిస్తున్నారు. చిన్నపార్టీలైన హెచ్ ఏఎమ్, ఆర్ ఎల్ ఎమ్ ఎన్డీఏ కూటమిలో, వీఐపీ, వామపక్షాలు మహాఘట్ బంధన్ కూటమిలో కీలకపాత్ర పోషించనున్నాయి.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇమేజ్, క్షేత్రస్థాయిలో సంస్థగతంగా బలంగా ఉండడం, డిజిటల్ రంగంలో దూసుకుపోవడం అంశాలతో రాష్ట్రంలో బీజేపీ 28 నుండి 29 శాతం ఓట్లతో పటిష్టంగా కనిపిస్తున్నా, ఆ పార్టీ నుండి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరిపేరు వినిపించకపోవడం పెద్ద లోపంగా కనిపిస్తుందని క్షేత్రస్థాయిలో పర్యటించిన పీపుల్స్ పల్స్ బృందం పరిశీలనలో తేలింది. 30 నుండి 31 శాతం ఓట్లతో బలంగా ఉన్న ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ పలు హామీలతో ముందుకెళ్తున్నా అగ్రవర్ణాల్లో ఆ పార్టీపై వ్యతిరేకత ఉండడం వారికి అడ్డుగా మారుతోంది. కాంగ్రెస్ యాత్రలతో బలపడుతున్నట్టు కనిపిస్తున్నా, ఆ పార్టీ సంస్థాగతంగా బలహీనంగా ఉంది. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న జేడీ (యు) ఈబీసీ సామాజికవర్గంలో బలంగా ఉండి, మహిళల మద్దతు పొందుతోంది. అయితే 74 ఏండ్ల వయస్సు గల ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆరోగ్యంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎల్జేపీ (ఆర్వీ) నేత చిరాగ్ పాశ్వాన్ కు దళిత సామాజిక వర్గంలో మంచి చరిష్మా ఉన్నా, ఎన్డీఏలో చీలిక భయాలున్నాయి. జేఎస్పీ పాదయాత్రలతో రాష్ట్ర వ్యాప్తంగా పలు హామీలతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నా ఆ పార్టీకి స్థిరమైన ఓటు బ్యాంక్ లేకపోవడం బలహీనత.

బహుముఖ పోటీలో కూటముల మధ్య సీట్ల కేటాయింపులు, ఓటర్లను ఆకర్షించడం, చివరి నిమిషం వరకు చేసే ప్రచారంపై ఫలితాలు ఆధారపడి ఉంటాయి. ఈబీసీలకు సరైన ప్రాధాన్యతిస్తూ టికెట్లు కేటాయిస్తే ప్రయోజనం ఉండే అవకాశాలున్నాయి. ఎన్డీఏలో బీజేపీ, నితీశ్, చిరాగ్ మధ్య విభేదాలొస్తే ఫలితంపై ప్రభావం చూపిస్తాయి. జేఎస్పీ ఎన్నికల్లో కింగ్మేకర్ పాత్ర పోషించనుంది. మొత్తం మీద బీహార్ ప్రజలు ఓటేస్తుంది కేవలం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం కోసమే కాదు. పార్టీలు హామీలిస్తున్న సంక్షేమాలు కుల రాజకీయాలను దాటగలవా? యువత ఆశలు విధేయతలను అధిగమించగలదా? ప్రశ్నలకు సమాధానం పోటా పోటీ ఎన్నికల ఫలితాలే తేలుస్తాయి. మరోవైపు ఎన్నికల వ్యూహకర్తగా జాతీయ స్థాయిలో పేరుగాంచిన ప్రశాంత కిశోర్ సొంత రాష్ట్రంలో ఎలాంటి ప్రభావం చూపిస్తారో అని దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

బీహార్ అసెంబీ ఎన్నికలు కేవలం రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ఆసక్తి రేపుతున్నాయి. 2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ పూర్తి మెజార్టీ సాధించకపోవడంతో ఇతర పార్టీలపై ఆధారపడి కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిస్తోంది. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి మద్దతిస్తున్న ఇతర పార్టీల్లో బీహార్ కు చెందిన జేడీ (యు), ఎల్జేపీ పార్టీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీహార్ శాసనసభ ఎన్నికల ఫలితాలు జాతీయ స్థాయి రాజకీయాలను ప్రభావితం చేయడం ఖాయం. బీహార్ లో ఎన్డీఏ మెజార్టీ సాధిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండకవపోవచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏ కూటమికి మెజార్టీ రాకపోయినా లేదా ఏ కూటమిలోనైనా ముఖ్యమంత్రి పీఠంపై చిక్కుముడి పడినా జాతీయ రాజకీయాల్లో పెను మార్పులు సంభవించే అవకాశాలున్నాయి.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# ప్రజా సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక ప్రజా దర్బార్



## ప్రజలనుండి సమస్యలపై వినతులు స్వీకరించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా :** నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం ప్రజా సేవ భవన్ లో నిర్వహించిన ప్రజా దర్బార్ కు నియోజకవర్గంలోని నలుమూలలనుండి ప్రజలు, పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వచ్చిన వారందరితో ప్రజా సేవాభవన్ కిక్కిరిసిపోయింది. ప్రజలు తమ సమస్యలను కంది శ్రీనివాస రెడ్డి కి వివరించి వినతి పత్రాలు అందించారు.ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విని సానుకూలంగా స్పందించారు. పలు సమస్యలపై ప్రజలిచ్చిన దరఖాస్తులను మంత్రులు ప్రభుత్వ పెద్దల వద్దకు చేర్చి పరిష్కారం కోసం కృషి చేస్తానని కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు.ప్రతీ వారం నిర్వహించే ప్రజాదర్బార్ లో ప్రజలు తమ సమస్యలు తెలియపరిచి సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిమ్మ సంతోష్, మునిగెల నర్సింగ్ ,సామ రూపేష్ రెడ్డి ,నాగర్కర్ శంకర్ , అల్చెట్టి నాగన్న , ఫైజుల్లా ఖాన్ , గుడిపట్టి నగేష్, కొండ గంగాధర్, బండారి సతీష్ , సందానర్సింగ్, రామ్ కుమార్ లోకప్రవీణ్ రెడ్డి, మంచాల మల్లయ్య, రావుల సోమన్న యాదవ్,రమేష్ రాంరెడ్డి ,మహమూద్ ,లత, సోనియామంథని, ఉయిక ఇందిర తదితరులు పాల్గొన్నారు.



## సీయం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** పేద బడుగు బలహీన వర్గాల సంక్షేం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధినుండి వచ్చిన చెక్కులను ఆయన తన క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు అందించారు. మొత్తం 14 లక్షల విలువ గల 27 చెక్కులను లబ్దిదారులకు అందించారు. సీయంఆర్ ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్య మంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు.అటు చెక్కలు అందుకున్నవారు ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృషి చేసిన కంది శ్రీనివాస రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిమ్మ సంతోష్ , మునిగెల నర్సింగ్ , సామ రూపేష్ రెడ్డి ,నాగర్కర్ శంకర్ , అల్చెట్టి నాగన్న , ఫైజుల్లా ఖాన్ , గుడిపట్టి నగేష్, కొండ గంగాధర్, బండారి సతీష్ , సందానర్సింగ్, రామ్ కుమార్ లోకప్రవీణ్ రెడ్డి, మంచాల మల్లయ్య, రావుల సోమన్న యాదవ్,రమేష్ రాంరెడ్డి ,మహమూద్ ,లత, సోనియామంథని, ఉయిక ఇందిర తదితరులు పాల్గొన్నారు

## జిల్లా గొర్ల పెంపకం దార్ల సంఘ కార్యవర్గానికి కంది శ్రీనివాస రెడ్డి సత్కారం

**ఆదిలాబాద్:** ఇటీవల జిల్లా గొర్ల పెంపకం దార్ల సంఘ ఎన్నికలలో విజయం సాధించిన సంఘ బాధ్యులు అధ్యక్షులు గవ్వల సాయి చైతన్య ,ఉపాధ్యక్షులుగా కెంద రాకేష్, కార్య వర్గ సభ్యులు కె.రవి కాంత్, కేమ లక్ష్మణ్,వై. కిష్టయ్య, జి. వేణు గోపాల్ ,అసుర రమేష్ పాత దేవన్న ,గోర్ల రాజన్న శుక్రవారం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. వారికి సాదర స్వాగతం పలికిన కంది శ్రీనివాస రెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ తరపున వారికి అభినందనలు తెలిపారు. గొల్ల కురుమలు అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గొల్లకురుమల ఐక్యతకు ఆర్థికాభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని కంది శ్రీనివాస రెడ్డి అభిలషించారు. ఈ కార్యక్రమంలో గిమ్మ సంతోష్ , తుమ్మల వెంకట్ రెడ్డి , అల్చెట్టి నాగన్న , ఫైజుల్లా ఖాన్ , గుడిపల్లి నగేష్, కొండ గంగాధర్, బండారి సతీష్ , సందానర్సింగ్, రామ్ కుమార్ లోకప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శ్రీ సాయి ఆప్టికల్స్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాదు పుష్పగిరి కంటి వైద్యశాల సహకారంతో శుక్రవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శ్రీ సాయి ఆప్టికల్ లో సుమారు వందమందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు అప్టోమెట్రిస్ట్ మల్లేష్ తెలిపారు. సుమారు 43 మందికి కంటి వైద్య చికిత్సలు నిర్వహించినట్లు, ప్రతి ఒక్కరికి మెరుగైన కంటి చూపు వచ్చేవరకు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ కంటి వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. సమాజానికి సేవ చేయాలనే తపనతో పుష్పగిరి కంటి వైద్యశాల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరము నిర్వహిస్తున్నట్లు, ప్రతి ఒక్కరూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు



## ఘనంగా ఐపీసి నూతన మందిర ప్రతిష్ట కార్యక్రమం

### ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోకవర్గం 22 డివిజన్ లోని ఐపీసి లో నూతన మందిర ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన చర్చ్ నూతన మందిర ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న సంఘ కాపరులకు, దైవ సేవకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన మందిరం ప్రతిష్టానంతరం ఇది దేవునికి అంకితం చేయబడుతుందని ఈ కార్యక్రమం ద్వారా కొత్త మందిరాన్ని దేవుని సేవకు అంకితం చేస్తూ, భవిష్యత్తులో జరగబోయే సేవలకు ఆశీర్వదించబడాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఐపీసి లోని నూతన మందిరంలో ప్రార్థనలు, పాస్టర్ల ఉపన్యాసాలు, భజనలు, ఇంకా పలు రకాల కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐపీసి లోని సంఘ ముఖ్యులు ఎంఎస్ సామ్యూల్, చుంచురాజు, చుంచు మహేష్ ప్రకాష్, ప్రేమ్ రాజు, జాషువా, జోసెఫ్, తో పాటు డివిజన్ లోని బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు చుంచు వంశీ, సురేష్ నరేష్,అరుణ్,సందీప్,పవన్ పాల్సన్,పద్మ మరియు తదితరులు పాల్గొన్నారు.



## గౌడన్నలకు ప్రమాదాలు జరుగకుండా కాటమయ్య రక్షణ కిట్లు

### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి, మహా :** గౌడన్నలు తాటి చెట్టు ఎక్కి కల్లు తీసే సమయంలో వారికి ప్రమాదాలు జరుగకుండా ఉండటానికి కాటమయ్య రక్షణ కిట్లను తప్పనిసరిగా వినియోగించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం భూపాలపల్లి మండలం ఎస్.ఎం కొత్తపల్లి గ్రామ శివారు సోలిపేట తాటి వనంలో జిల్లా బీసీ సంక్షేమ మరియు ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో రక్షణ కిట్ల ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికులకు పూర్తి స్థాయిలో కాటమయ్య రక్షణ కిట్లను అందించే దిశగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా కుల వృత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం కిట్లు అందుకున్న వారితో ఎమ్మెల్యే గ్రూపు ఫోటో దిగారు.



## స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములవ్వాలి

**ఆమనగల్లు, మహా:** స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎంపీడీవో కుసుమ మాధురిపిలుపునిచ్చారు. శుక్రవారం అమనగల్లు మండల కేంద్రంలో శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాల, కళాశాల విద్యార్థులు, యాజమాన్యం, వివిధ శాఖల అధికారులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పారిశుధ్యం, పచ్చదనం, పరిశుభ్రత, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలతో పాటు వీధులు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ మానవీయతకు ప్రతిరూపం మహమ్మద్ ప్రవక్త

**ఆమనగల్లు, మహా:** ప్రపంచ మానవీయతకు ప్రతిరూపం మహమ్మద్ ప్రవక్త అని పలువురు ముస్లిం సోదరులు తెలిపారు. శుక్రవారం నమాజ్ అనంతరం అమనగల్లు పట్టణ కేంద్రంలోని జామ మస్జీద్ ఆవరణలో మొహమ్మద్ ప్రవక్త పేరుతో బోర్డును పెడితే ముస్లిం యువకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ ప్రవక్త పేరుతో పోస్టర్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ జీవన గమనంలోని ప్రతి అడుగును సంస్కరించిన మహనీయుడు మహ్మద్ ప్రవక్త అన్నారు.మనిషి పుట్టుక నుంచి మరణం వరకు జీవించ వలసిన శైలిని నిర్దేశించిన ఆదర్శప్రాయుడు.శాంతి, ధర్మం, సమానత్వం,తొటి వారి పట్ల ఎలా మెలగాలో సూచనలు చేశారాని,. మహమ్మద్ ప్రవక్త. ముస్లింలను ఆధ్యాత్మిక చింతన వైపు నడిపించారన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ లో మొహమ్మద్ ప్రవక్త పేరుతో బోర్డును పెడితే ముస్లిం యువకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మాసుమ్, ఖలీల్, పాష,జబ్బర్, నవజావాన్ కమిటీ ఇంచార్జీ అహ్మద్,అబ్దుల్ హఫీజ్,అజీమ్, షోయబ్,అసద్,షబ్బీర్, జహీర్, అప్రోజ్ , బాబా ,అంజు, అరీఫ్ తదితర మైనార్టీ నాయకులు పాల్గొన్నారు

## పాత బస్టాండుకు బస్సులు రావాలె..

### ఇబ్రహీంపట్నం బిజెపి నాయకులు

**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం పాత బస్టాండ్ కు బస్సులు రావాలంటూ, బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నంలోని బస్సు డిపో నుంచి బస్సులు రాకపోకలు సాగించే క్రమంలో, గతంలో మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలోని పాత బస్టాండ్ కు, సిటీ బస్సులు వచ్చి వెళ్లేవని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉండేదని, ప్రస్తుతం పాత బస్టాండ్ లోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు ముత్యాల మహేందర్ ఆధ్వర్యంలో బస్సు డిపో ముందు ధర్నా చేపట్టారు. ఇబ్రహీంపట్నం బస్సు డిపో మేనేజర్ రావాలంటూ నినాదాలు చేయడంతో, డిప్యూటీ డిపో మేనేజర్ వచ్చినా ఫలితం లేకపోయింది. ఈ కారణంగా సాగర్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది, దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు, ధర్నాకు దిగిన బిజెపి కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ... పాత బస్టాండ్ కు బస్సులు రావాలని పలుమార్లు డిపో మేనేజర్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అలాగే గురువారం రాత్రి అంబేద్కర్ చౌరస్తాలో, బస్సు పాత బస్టాండుకు వెళ్లదు అంటూ డ్రైవర్ చెప్పడంతో, ఒక వృదురాలు బస్సు పాత బస్టాండ్ వెళ్లాలని డ్రైవర్ను అడగడంతో అతను ఆమెపై దురుసుగా ప్రవర్తిస్తూ మాట్లారాని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి పాత బస్టాండు, ఆ తర్వాత ప్రాంతాలకు రెండు కిలోమీటర్ల మేరా దూరం ఉంటుందని, వృద్ధులు మహిళలు చిన్న పిల్లలు రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ రావాలంటే ఎంత ఇబ్బంది ఉంటుందో తెలుసుకుని, ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి బస్సులను పాత బస్టాండ్ కు నడపాలని, డిపో మేనేజర్ వెంటనే స్పందించి పాత బస్టాండ్ కు వచ్చే విధంగా హామీ ఇచ్చి, వెంటనే బస్సు డ్రైవర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పాత బస్టాండ్ కు బస్సులు రాకపోతే, పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఆర్టీసీ యాజమాన్యాన్ని బిజెపి నాయకులు హెచ్చరించారు. దురుసుగా ప్రవర్తించిన ఆర్టీసీ డ్రైవర్ల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నాయన సత్యనారాయణ, జక్క రవీందర్ రెడ్డి, ఆకుల సంతోష్, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా ;** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రూ. 6.48 కోట్లతో పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. మణికొండ మున్సిపాలిటీ నిధుల నుంచే ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. స్పోర్ట్స్ పార్క్ అభివృద్ధి పనులను శంకుస్థాపన చేశారు. బి టి, రోడ్లులను మున్సిపాలిటీ పరిధిలని వివిధ వార్డులలో పనులు ప్రారంభించారు.మణికొండ మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఉద్దేశించినవి. ఈ కార్యక్రమంలో మణికొండ మాజీ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, మున్సిపల్ అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ

**ఆమనగల్లు, మహా:** తెలంగాణలో బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగ అని ఆమనగల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శర్వాణి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీలు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ శర్వాణి హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ రాజకుమార్, రాజు, గోపాల్, నవనీత, శ్రీవాణి, హరీష్, సరళ, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు






## ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అంబరాన్నింటిన బతుకమ్మ సంబరాలు

**బెల్లంపల్లి,మహా:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో భాగమైన బతుకమ్మ పండుగసంబరాలు శుక్రవారం బెల్లంపల్లి డిగ్రీ, పీజీ కళాశాలలో అంబరాన్నంటాయి. కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు, అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఆటపాటలతో ఆకట్టుకున్న వేడుక.. ముందస్తు బతుకమ్మ సంబరాల కోసం కళాశాల మైదానంలో పెద్ద ఎత్తున షామియానా ఏర్పాటు చేశారు. అనంతరం మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం ప్రిన్సిపాల్ మరియు ఇతర అధ్యాపకులు కొబ్బరికాయలు కొట్టి బతుకమ్మ ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు, విద్యార్థులు అందరూ కూడా బతుకమ్మ ఆడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. వెళ్లి రా బతుకమ్మ.. మళ్లీ రా బతుకమ్మ.. అంటూ ఆటపాటలతో హోరెత్తించారు. బతుకమ్మ పాటలకు తగ్గట్టుగా నృత్యాలు చేస్తూ కార్యక్రమాన్ని ఆద్యంతం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.




## స్వశక్తి పరివార్ అభియాన్ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

**ఆమనగల్లు, మహా:** స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు మైమున బేగం, మంజులదేవి అన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమనగల్లు పీహెచ్సి లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ శిబిరం లో 241 మంది ప్రజలకు వివిధ విభాగాల వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వస్థ నారి స్వశక్తి మహిళల ఆరోగ్య రక్షణకు అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగల వైద్యులు ఆమని, ఆదిత్య, గాయత్రి, ప్రతిష్, అతుల్ దాస్, ఖురేషి, జయశ్రీ,రచన సింగ్,విజయ లక్ష్మి, తిరుపతి రెడ్డి, రవి కుమార్, చంద్ర శేఖర్,చంద్ర శేఖర్ రెడ్డి, నాగేశ్వరి , యేసు మణి, సునీత, అలివేలు, వేణు, శ్రీను ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు...

## భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మహా :** రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై విచారణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, అసైన్డ్ భూముల విచారణ, భూ భారతి, 22ఏ తదితర కీలక అంశాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా దరఖాస్తుల స్థితిని తెలుసుకున్న కలెక్టర్ దరఖాస్తుల విచారణను వేగవంతం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలంటే అధికారులు వచ్చిన దరఖాస్తులు ఆదారంగా క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. భూ రికార్డుల ప్రామాణికతను నిర్ధారిస్తూ పారదర్శకంగా వ్యవహరించాలని, అవసరమైన సందర్భాల్లో సంబంధిత అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## డైలీ వర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**ఆమనగల్లు, మహా:** గిరిజన ఆశ్రమ పాఠశాలలు మరియు హాస్టల్లలో పనిచేస్తున్న డైలీ వేజ్ మరియు కాంటినింజెంట్ వర్కర్ల న్యాయమైన సమస్యలను డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి డిమాండ్ చేశారు. కడ్తాల్ మండల కేంద్రం గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో కడ్తాల్, ఆమనగల్, మైసిగండి తదితర ప్రాంతాలకు చెందిన ఆశ్రమ పాఠశాలల డైలీ వర్కర్ల సమ్మె కార్యక్రమానికి మద్దతు పలికారు. ఎనిమిది రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉండడాన్ని తీవ్రంగా ఖండించారు. అదేవిధంగా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యమైనందునే విధిలేక సిబ్బంది సమ్మె నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆయా పాఠశాలలలో పనిచేస్తున్న వర్కర్లకు 13,800/ వచ్చే జీతాన్ని ఈ ప్రభుత్వం 11,700/ కు తగ్గించడం ఎంతవరకు సమంజసం అని అడిగారు. ప్రభుత్వం జీవో నెంబర్ 64 వెంటనే ఉపసంహరించుకొని, ప్రస్తుత నిబంధనలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారమే జీతభత్యాలు అందించాలని డిమాండ్ చేశారు. సుమారు పది నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న వర్కర్ల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం చోద్యం చూస్తుందని, వెంటనే పెండింగులో ఉన్న పది నెలల జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుండి స్పందన లేనందున సమ్మెలో మార్పు లేకపోవడంతో విద్యార్థులు చేసేది లేక ఇంటి బాట పట్టడంతో, విద్యా వ్యవస్థపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టంగా కనిపిస్తుందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డైలీ వేజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని లేనిచో ఉద్యమం మరింత తీవ్రతరంగారూపుదిద్దుకుంటుందని హెచ్చరించారు. మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, బీసీ సంఘం మండలాధ్యక్షుడు పిప్పళ్ళ వెంకటేష్, మాజీ గ్రామ రైతు కోఆర్డినేటర్ నర్సింహ్మా,బీఆర్ఎస్ నాయకులు గూద రాములు, సిద్దిగారి దాసు,అమృతం పాండు,గుడెపు మహేష్,శేఖర్, సురేష్,మహిళా వర్కర్లు సైదమ్మ, సంతోష,అలివేలు పాల్గొన్నారు.





## ఆర్ఓబి పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే నాయిని

**హన్మకొండ మహా;** కాజీపేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి) పనులు వేగంగా సాగుతున్నాయి. అభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జరుగుతున్న ఈ నిర్మాణ పనులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాజీపేట ఆర్ఓబి కింద ఇప్పటికే మొదటి వంతెన పనులు పూర్తికాగా, రెండో వంతెన నిర్మాణం కొంతమేర పురోగమించిందని తెలిపారు. రైల్వే అధికారుల సూచనల మేరకు ఇనుప వంతెన నిర్మాణం చేపట్టామని ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పించేందుకు, ట్రాఫిక్ ను తగ్గించేందుకు రెండో వంతెన పనులను కూడా వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఎటువంటి ఆలస్యం జరుగకుండా చూడాలని, అనవసరమైన జాప్యాలను నివారించాలన్నారు.ఇదిలా ఉండగా, పాత వంతెన మరమ్మత్తు పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.59 లక్షల నిధులను మంజూరు చేసిందని తెలిపారు.



## నిబంధనల మేరకే భవన నిర్మాణ అనుమతుల మంజూరు

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ మహా;** నిబంధనల మేరకే భవన నిర్మాణ అనుమతుల మంజూరు చేయడం జరుగుతుందని బల్దియా కమినర్ చాహత్ బాజ్ పాయ్ స్పష్టం చేశారు. బల్దియా పరిధి ఖమ్మం హైవే బైపాస్ రోడ్డు కు గల ఫాదర్ కొలంబో ఆసుపత్రి ప్రాంతంలో భవన నిర్మాణ అనుమతుల మంజూరు అక్యూపెన్సీ సర్టిఫికెట్ జారీ కోసం శుక్రవారం ఆయా ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో నమోదు చేసిన కొలతలు, సమర్పించిన ధృవ పత్రాలు పరిశీలించిన కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో ఏ సి పి ఏర్షాద్, సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.



## ఖిలా వరంగల్ మండల తహసిల్దార్ గా మహమ్మద్ ఇక్బాల్

**వరంగల్ మహా;** వరంగల్ మండల తహసిల్దార్గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ ఇక్బాల్, ఖిలా వరంగల్ మండలానికి బదిలీ అయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఖిలా వరంగల్ తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్బాల్ బదిలీ సందర్భంగా సహచర సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఖిలా వరంగల్ మండల ఇంచార్జి తహశీల్దార్ శ్రీకాంత్ వరంగల్ మండలం తహశీల్దార్ గా బదిలీ అయ్యారు.



## శ్రీ ధనమైసమ్మ ఆలయంలో వైభవంగా బతుకమ్మ, దసరా ఉత్సవాలు

**ఆలయ అధ్యక్షులు తోట బాబన్న**

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం శ్రీ శివసాయినగర్ కాలనీలోని శ్రీ మెట్లబావి ధనమైసమ్మ దేవాలయంలో సద్దుల బతుకమ్మ దసరా దేవి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించబడతాయని ఆలయ అధ్యక్షులు తోట బాబన్న తెలిపారు. మెట్లబావి ధనమైసమ్మ దేవి నవరాత్రులు దసరా ఉత్సవాలు తేది 22092025 సోమవారం నుండి తేది 02102025 గురువారం వరకు నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భాగంగా తొమ్మిది కలశాలను ప్రతిష్టించి వివిధ రూపాలలో అలంకరించిన అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనుందని అంతేకాకుండా ఈ తొమ్మిది రోజులు ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించడం తో పాటు ప్రతి రోజు ఉదయం 10.00 గంటల పూజ అనంతరం తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని అలాగే పూజలో పాల్గొనే దంపతులు తమ వివరాలను ముందుగానే తెలుపాలని ఆలయ అధ్యక్షులు కోరారు. ముఖ్యంగా సద్దుల బతుకమ్మ 21092025, నుంచి 29092025 తేదీ వరకు ఆలయంలో ప్రతి రోజు బతుకమ్మ ఆడిన మహిళామణులకు చివరి రోజు గ్రూపుకు బహుమతి కూడా ఇవ్వబడుతుందని శ్రీ మెట్లబావి ధనమైసమ్మ దేవాలయ అధ్యక్షులుతోట బాబన్న , కమిటీ సభ్యులు తెలిపారు.

## జిల్లాలో అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




**కాటారం, మహా:** జిల్లాలో అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే లతో కలిసి పోలీసు, రెవెన్యూ, టీజీఎండీసీ, గృహ నిర్మాణ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుకను అందించడం జరుగుతుందని అన్నారు. కొందరు అక్రమార్కులు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో తప్పుడు పత్రాల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేపట్టి అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. అక్కడక్కడ పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుందని అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ కట్టడాలకు ఇసుక ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని ప్రభుత్వ రంగ సంస్థల కోసం ఇసుక రవాణా కు టీ.ఎస్.ఎం.ఐ.డి.సి ద్వారా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ఇసుకతో పాటు మట్టికి కూడా అనుమతులు ఇవ్వాలని నియోజకవర్గంలో పరిశ్రమల నిర్మాణానికి సైతం ఇసుక ఉచితంగా అందించాలని తెలిపారు.పంచాయతీ సెక్రటరీలు, ఇందిరమ్మ ఇళ్లుకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. శాయంపేట మండలం నుండి స్థానిక పంచాయతీ కార్యదర్శి నుండి అనుమతితో ఉచితంగా పొందాలన్నారు. రాజకీయ పలుకుబడులు, ఒత్తిడులు ఎన్ని ఉన్న ఖచ్చితంగా అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. తహసీల్దార్లు అక్రమ ఇసుక దంపులను సీజ్ చేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి వేలం వేయాలని అన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ఇసుక నిల్వలు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రభుత్వం కేటాయించిన ధర ప్రకారం మాత్రమే అందించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రత్యేకంగా పంచాయతీ సెక్రటరీలకు రశీదు పుస్తకాలు ఈ నెల 25 వ తేదీ వరకు పంపిణీ చేయాలని మండలాలలో పోలీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించాలని తెలిపారు. గ్రామ స్థాయిలో టామ్ టామ్ వేయించాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రభుత్వ యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇసుక రవాణా 24 తేదీ నుండి ఇసుక రవాణా కు కూపన్లు అందిస్తామన్నారు. అక్రమ ఇసుక రవాణాను, ఇసుక డంపులపై కచ్చితంగా కేసుకు నమోదు చేయాలని అన్నారు. పంచాయతీ సెక్రెటరీలు గ్రామ స్థాయిలో, మండల స్థాయిలో ఎంపిడిఓలకు బాధ్యత అప్పగిస్తామని తెలిపారు. ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటలకు వరకు ఉచిత రవాణా కు అనుమతులు ఇస్తున్నామని స్పష్టం చేశారు. రెవిన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, రవాణా శాఖల అధికారులతో టాస్క్ ఫోర్స్ టీం ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామంలో ఇసుక అక్రమ రవాణా చేపడితే కట్టిన చర్యలు తీసుకుంటామని అవగాహనకు దండోరా వేయాలని అన్నారు. ఇసుక డంపులను జిల్లా కలెక్టర్ సమక్షంలో వేలం జరగాలని సూచించారు. యూరియా అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వ్యవసాయ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గత సంవత్సరం లాభాల వాటా 35 శాతం ఇవ్వాలి

**మందమర్రి జిఎం కార్యాలయం ముందర గుర్తింపు సంఘం ధర్నా**

**మందమర్రి, మహా :** గత 2024 25 సంవత్సరం సింగరేణి సంస్థ గడించిన లాభాలలో కార్మికులకు 35 శాతం లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి మందమర్రి జిఎం కార్యాలయం ముందర ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందమర్రి బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ గత స్ట్రక్చర్ సమావేశంలో కార్మికుల సొంత ఇంటి సహకారం, పెర్క్స్ పై ఇన్కంటాక్స్, మారు పేర్ల సమస్య, తదితర డిమాండ్లపై సర్క్యులర్ రూపకంగా జారీ చేయాలని తమ యూనియన్ డిమాండ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆ మాట వినకుండా యాజమాన్యం మొండికేసిందని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం సింగరేణి కార్మికుల ప్రధాన సమస్యలను పట్టించుకోవాలని అన్నారు. సింగరేణి యాజమాన్యం ఈ వారం రోజుల్లో లాభాల మాట ప్రకటించకుంటే తమ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేయక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, కార్యకర్తలు, సివిక్ కాంటాక్ట్ కార్మికులతో పాటు రామకృష్ణాపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎండి అక్బర్ అలీ, బెల్లంపల్లి కార్యదర్శి దాగం మల్లేష్, ఆ యూనియన్ ఉపాధ్యక్షులు భీమనాథని సుదర్శన్, తిరుపతి గౌడు,ఏరియా నాయకులు ఇప్పకాయల లింగయ్య, సోమిశెట్టి రాజేశం, కంది శ్రీనివాస ,పెద్దపెల్లి బానయ్య, సి.వీ. రమణ, ఎగేటి రాజేశ్వరరావు,



ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, గోపతి సత్యనారాయణ, రాజేష్ కుమార్ యాదవ్, పిట్ కార్యదర్శిలు గాండ్ల సంపత్, మీనుగు లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్, సిహెచ్ పి శర్మ, కందకట్ల ఓదెలు, ప్రేమ్లాల్ సట్ల కొండయ్య,. పాల్గొన్నారు, అనంతరం పలు డిమాండ్ల వినతి పత్రాన్ని ఏరియా ఎస్ ఓ టు జిఎం విజయ ప్రసాద్ కు అందజేశారు.

**గుర్తింపు సంఘం ధర్నా చేయడం సిగ్గుచేటు**

సింగరేణి గుర్తింపు సంఘం (ఏఐటియుసి) ధర్నా చేయడం సిగ్గుచేటని మందమర్రి ఐఎన్టియుసి ఉపాధ్యక్షులు దేవి భూమయ్య వాక్యానించారు. గత స్ట్రక్చర్ సమావేశాన్ని రద్దు చేసుకొని ఇలాంటి నీతి వాక్యాలు వహించడం తగదని ఆయన హితవుపలికారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ సింగరేణి వ్యాప్త స్ట్రక్చర్ సమావేశాన్ని రద్దు చేసిన సంగతి గురించి ఇది వరకే తమ యూనియన్ పాత్రికేయులకు తెలియపరచిందని ఆయన చెప్పారు. సింగరేణి కంపెనీ రెండు నాలుకల ధోరణి అవలంబిస్తుందని విమర్శించారు. నిజా నిజాలను కార్మిక వర్గం పరిశీలించవలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.




## అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మందమర్రి / మంచిర్యాల, మహా :** ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని మందమర్రి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని తహసిల్దార్ సతీష్ కుమార్ తో కలిసి సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సేవల కొరకు కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల గౌరవంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. వివిధ ధ్రువపత్రాల కొరకు కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి వంటశాల, మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందని చెప్పారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వివరించారు ఉపాధ్యాయులు విధులలో సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్ గ్రామంలో సబ్ స్టేషన్ ఏర్పాటు కొరకు స్థల పరిశీలన చేశారు. వెంకటాపూర్ గ్రామంలో నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణ పై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా విజేతలకు బహుమతుల పంపిణీ

**కాటారం, మహా :** మహాదేవపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్ జీ ఎఫ్ జోనల్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. గత మూడు రోజులుగా మహాదేవపూర్ బాలుర పాఠశాల ఆవరణలో వాలీబాల్, కబడ్డీ మరియు ఖో ఖో క్రీడాలు జరిగాయి. జోనల్ స్థాయి క్రీడల్లో మహాదేవపూర్, పలిమెల మహాముత్తారం మండలాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, పీ ఏ సీ ఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి లు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు దేహధారుధ్యం మరియు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని, ఏ వ్యక్తి అయినా తను ఎంచుకున్న రంగంలో రోజూ ఓ గంట ప్రాక్టీస్ చేస్తే తనకు ఏదైనా సాధ్యమవుతుందని క్రీడాకారుల్ని ఉద్దేశించి మాట్లాడారు.క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులు జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొననున్నారు.ఈ కార్యక్రమం



మండల విద్యాధికారి బి.ప్రకాష్ బాబు. బాలుర పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి. బాలికల పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మడక మధు , గ్రీన్ ఉడ్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి , గుడ్ మార్నింగ్ స్కూల్ కరస్పాండెంట్ సూర్యజిత్ , ఎస్.జీ.ఎఫ్ జోనల్ సెక్రటరీ సిరంగి రమేష్, మండల కన్వీనర్ కార్తీక్ మరియు మండల వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ క్రీడోత్సవాలు నిర్వహించడంలో సహకరించిన ప్రధానోపాధ్యాయులకు ఉపాధ్యాయులకు వివిధ పాఠశాలల పీఈటీలకు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల భద్రత కోసమే కార్డెన్ సర్చ్

**కాటారం డిఎస్పి ఏ. సూర్యనారాయణ**

**కాటారం, మహా :** ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్సర్చ్ నిర్వహిస్తున్నామని కాటారం డిఎస్పి ఏ. సూర్యనారాయణ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారు జామున కాటారం మండలం కొత్తపల్లిలో డిఎస్పీ, సిఐ నాగార్జున రావు, ఆధ్వర్యంలో 65 మంది పోలీసు సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్ లేని 12 ద్విచక్ర వాహనాలు, ఇద్దరు వ్యక్తుల నుంచి 40 లీటర్ల గుడుంబా, 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు



గా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి రవాణా చేసిన, విక్రయించినా, సేవించినా చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ హెచ్చరించారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. భూసంబంధిత గొడవల్లో పాల్గొని అమాయకులను మోసం చేస్తే కఠిన చర్యలుంటామమని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనపడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి, గుడుంబా, ఇతర అక్రమ రవాణా వంటివి ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 ను సంప్రదించాలని, లేదా నేరుగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని , సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అలాగే ముఖ్యంగా ప్రజలు సి సి కెమెరాలు ఏర్పాటుకు ముందుకు రావాలని డిఎస్పీ కోరారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కాటారం సిఐ నాగార్జున రావు, ఎస్సైలు మహేందర్ కుమార్, శ్రీనివాస్, ఓం పాల్, మహేష్, మానస, 65 మంది సివిల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడం తో పాటు బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని వరంగల్ జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో అట్రాసిటీ కేసుల పెండింగ్, పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ అంశాలపై చర్చించి కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, గత సమావేశంలో చర్చించి తీసుకొన్న చర్యల గురించి వివరిస్తూ, ప్రస్తుతం 26 కేసు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో అట్రాసిటీ అంశాలతో ముడిపడి ఉన్న సంఘటనల గురించి ఎప్పటికప్పుడు తమ దృష్టికి తేవాలని అన్నారు. ప్రతీ నెల తప్పనిసరిగా గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించే సమావేశానికి తహసీల్దార్, ఎస్హెచ్ఓలు సంబంధిత శాఖల అధికారులు హాజరవ్వాలని కలెక్టర్ అన్నారు. గ్రామల్లో గుడుంబా, గంజాయి అరికట్టుటకు ఎక్సైజ్ అధికారులు శ్రద్ధ పెట్టాలని అన్నారు. కళాజాత



బృందాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలను పరిగణలోకి తీసుకుని సమస్యలు పరిష్కార దిశగా కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు. అనంతరం వరంగల్ సబ్ డివిజన్ ఏఎస్పీ శుభం ప్రకాష్ మాట్లాడుతూఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్నప్పుడు పోలీస్ శాఖ తరపున బాధితులకు తప్పనిసరిగా పూర్తి న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామన్నారు.ఈ సమీక్ష సమావేశం లో జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవోరాం రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సౌజన్య , సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురళి, డీఈఓ రంగయ్య నాయుడు, డిడబ్ల్యుఓ రాజమణి, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి , ఉమారాణి, ఏసీపీలు రవీందర్, వెంకటేష్ ఎస్ హెచ్ వో లు విజిలెన్సు, మానిటరింగ్ కమిటీ సభ్యులు బిర్రు మహేందర్, చిన్న స్వామి, యాదగిరి, మహేందర్, విజయకుమార్ పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ బయోపిక్ ను వీక్షించిన జిల్లా అధ్యక్షుడు

**పాల్గొన్న జిల్లా బీజేపీ శ్రేణులు**

**వరంగల్ మహా;** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో వరంగల్ స్టేషన్ రోడ్ లో గల S2 మాల్ లో బిజెపి జిల్లా నాయకులు భారత ప్రధాని నరేంద్ర మోదీ జీవిత కథ బయోపిక్ మూవీని బీజేపీ శ్రేణులతో కలిసి విక్షించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచ దేశాలు అనుసరించే విధంగా దేశాన్ని పరిపాలిస్తున్న మహా నాయకుడని కొనియాడారు. ఒక్కరోజు కూడ సెలవు తీయనుకోకుండా 13 ఏళ్ళు సీఎంగా, గత 12 ఏళ్లుగా ప్రధానిగా దేశానికి సేవలను అందిస్తున్నారని కేవలం రోజుకు 4 గంటలు మాత్రమే నిద్రపోయి, మిగత సమయం మొత్తం దేశాసేవకు అంకితమై పని చేస్తున్న నిత్య శ్రామికుడు, కృషివలుడు మోదీ అని కొనియాడారు. వారి జీవితం నేటి తరానికి, రాబోవు తరానికి




ఆదర్శంగా నిలవనున్నారు. మేకిన్ ఇండియా పేరుతో యువతలోని నైపుణ్యం బయటకు తీసి స్వయం ఉపాధి వైపు యువత నడిచేలాగా దారి చూపిన దర్శనికుడు అని పేర్కొన్నారు. ప్రస్తుతం జీఎస్టీ ని తగ్గించి పేద బడుగు బలహీన వర్గాలకు పేదల పెన్నిధిగా మోడీ మారారని గంట రవికుమార్ అన్నారు. ఈ మోడీ బయోపిక్ వరంగల్ లోని S2మాల్ లో ఈరోజు నుండి 24వ తేదీ వరకు ఉచితంగా ప్రదర్శించ బడుతుందని మోడీ అభిమానులు యువత బిజెపి శ్రేణులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రారంభించిన వరంగల్ జిల్లా కలెక్టర్**

**వరంగల్ మహా;** ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. శుక్రవారం ఏరీక్షన్ టిపిఏ హైదరాబాదు వారి ఆధ్వర్యంలో ఇంటిగ్రో హాస్పిటల్ హైదరాబాదు, ప్రమోద హాస్పిటల్, హన్మకొండ సౌజన్యంతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ఫ్ వరంగల్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అందరికి మరియు వారి కుటుంబ సభ్యులకు ఏర్పాటుచేసిన ఉచిత ఆరోగ్య శిబిరానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై క్యాంప్ ను ప్రారంభించి ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఆరోగ్య శిబిరంలో కార్డియాలజీ, యురాలజి, వస్కులర్ సర్జరీ జనరల్ మెడిసిన్, ఈసిజి, ఆర్బిఎస్, బిపి, 2డి ఇకో వంటి పరిక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



రామిరెడ్డి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, వివిధ హాస్పటల్ కు చెందిన డాక్టర్లు సందీప్, లిల్లీ, విష్ణు వర్ధన్ పవన్ సెర్ప్ సిబ్బంది, డిపీఎంలు, ఏపీఎంలు, సిసి లు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హన్మకొండ మహా;** భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను నిర్వహించగా నిబంధనలను అనుసరించి అర్హత కలిగి ఆమోదయోగ్యమైన అన్ని దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూభారతి దరఖాస్తులు, ఇప్పటివరకు పరిష్కరించిన వాటి సంఖ్య, ఇంకా పరిష్కారమయ్యే దరఖాస్తులు, 22(ఏ) కిందకు వచ్చే భూములు, సాదా బైనామా, ఫారెస్ట్ భూములు, శిఖం, అసైన్డ్ భూములు, తదితర రెవెన్యూ అంశాలపై హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో మండలాల వారీగా భూభారతి దరఖాస్తులు, పరిష్కరించిన దరఖాస్తులు,



ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను, సాదా బైనామా దరఖాస్తుల గురించి తహసీల్దార్లు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహబరీష్ మాట్లాడుతూ భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లాలోని మండలాల పరిధిలో ఉన్న ప్రభుత్వ, చెరువు శిఖం, అసైన్డ్, తదితర ప్రభుత్వ భూముల వివరాలను అందజేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, తహసీల్దారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యతోనే బాలలకు ఉన్నతమైన భవిష్యత్తు

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్ మహా;** నిరాదరణ కలిగిన బాలలకు విద్య అందించుట అందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ నగరం లోని ఎనుమాముల ఎన్టీఆర్ నగర్ నందు మండల ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఇతర రాష్ట్రాల నుంచి వరంగల్ కు వలస వచ్చి తల్లిదండ్రుల తోపాటు విద్యా వసతులు లేకుండా ఉన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన బాలలకు శుక్రవారం ఎడ్యుకేషనల్ కిట్ పంపిణీ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్రి నాయక్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఆంటీ హ్యూమన్ ట్రాఫిక్కింగ్ యూనిట్ వరంగల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా పోలీసు, ఇతర శాఖల సహకారంతో బడి బయట ఉన్న పిల్లల్ని, బాల కార్మికులు నిరాదరణ కలిగిన పిల్లల్ని గుర్తించి రెస్క్యూ చేయడం జరిగింది. అనంతరం వారి వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని తెలిపారు అయితే పూర్తిస్థాయి పునరావాసం పిల్లలకు జరగాలంటే వారికి విద్య అందించడమే ప్రాథమిక లక్ష్యం అని దానిలో భాగంగానే నేడు ఈ పాఠశాలలో బీహార్, ఒరిస్సా ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 62 మంది పిల్లల్ని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో అడ్మిట్ చేసి వారికి కావలసిన పూర్తి సహాయ సహకారాలను అందించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా పిల్లల్ని ఎవరైనా తల్లిదండ్రులు గాని ,వ్యాపారస్తులు గాని పనిలో పెట్టినట్టయితే చట్టరీత్యా వారి పైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు .




# హైదరాబాద్‌కు గోదావరి నీరు.. రూ.2,085 కోట్ల కాంట్రాక్టు దక్కించుకున్న రాంకీ

హైదరాబాద్: దేశంలో ప్రముఖ ఇన్‌ఫ్రా సంస్థలలో ఒకటైన రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) నుండి రూ.2,085 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. ఈ ఒప్పందం గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ II & ఫేజ్ IIIకి సంబంధించినది. ఇందులో భాగంగా మూసీ నది పునరుజ్జీవనానికి సహాయపడటానికి ఉస్మాన్సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లను గోదావరి నీటితో నింపనున్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) కింద రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుబంధ సంస్థ అయిన మల్లన్నసాగర్ వాటర్ సప్లై లిమిటెడ్ ద్వారా ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. ఒప్పందంలో భాగంగా, రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రెండేళ్లలో నిర్మాణాన్ని చేపడుతుంది. పూర్తయిన తరువాత 10 సంవత్సరాల పాటు నిర్వహణను చూసుకుంటుంది. "ఈ ప్రాజెక్ట్ పెరుగుతున్న తాగునీటి అవసరాలను తీర్చడమే కాకుండా స్థిరమైన నీటి మౌలిక సదుపాయాలను నిర్మించాలనే మా నిబద్ధతను బలోపేతం చేస్తుంది. హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీతో భాగస్వామ్యం కావడం మాకు గర్వంగా ఉంది" అని రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యంచర్ల రత్నాకర నాగరాజా పేర్కొన్నారు.



# సీబీఐ చార్జ్‌షీట్‌పై స్పందించిన అనిల్ అంబానీ కంపెనీలు

రూ.2,796 కోట్ల బ్యాంకు మోసం కేసులో అనిల్ అంబానీ, ఇతరులపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దాఖలు చేసిన ఛార్జిషీట్ తమ కార్యకలాపాలపై లేదా ఆర్థిక పనితీరుపై ఎటువంటి ప్రభావం చూపదని రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తెలిపింది. రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ (ఆర్‌సీఎఫ్ఎల్), రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ (ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్), యెస్ బ్యాంక్, యెస్ బ్యాంక్ మాజీ సీఈఓ రాణా కపూర్ కుటుంబానికి సంబంధించిన సంస్థల మధ్య మోసపూరిత లావాదేవీలు జరిగాయని ఆరోపిస్తూ సీబీఐ ఇటీవల చార్జిషీట్ దాఖలు చేసింది. 2022, 2023లో సుప్రీంకోర్టు తీర్పుల తరువాత, ఆర్బీఐ నిబంధనల ప్రకారం బ్యాంక్ ఆఫ్ బరోడా నేతృత్వంలోని స్వతంత్ర రుణదాత ఆధారిత ప్రక్రియల ద్వారా ఆర్‌సీఎఫ్ఎల్, ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్‌కు సంబంధించిన సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యాయని రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రెండూ వేర్వేరు ఎక్స్ఛేంజ్ ఫైలింగ్స్ లో తెలిపాయి.




ఆర్‌సీఎఫ్ఎల్, ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్ బోర్డుల్లో అనిల్ అంబానీ ఎప్పుడూ ఉండలేదని, మూడున్నరేళ్ల క్రితమే రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బోర్డుల నుంచి వైదొలిగారని కంపెనీలు తెలిపాయి. తాము ప్రత్యేక లిస్టెడ్ సంస్థలుగా ఉన్నామని, సీబీఐ చర్య తమ నిర్వహణ, పాలన లేదా ఆర్థిక స్థిరత్వంపై ఎటువంటి ప్రభావం చూపదని పేర్కొన్నాయి.

# ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్.. 10 నిమిషాల్లోనే డెలివరీ




ఈ ఏడాది ఫ్లిప్‌కార్ట్ తన ప్రముఖ ఉత్సవ సేల్ "ది బిగ్ బిలియన్ డేస్" (TBBD) 2025ను భారతదేశంలోనే వేగవంతమైన షాపింగ్ ఫెస్టివల్‌గా మార్చుతోంది. దీని ముఖ్య ఆకర్షణగా "ఫ్లిప్‌కార్ట్ మినిట్స్" పరిచయం అవుతోంది. కేవలం 10 నిమిషాల్లో డోర్‌డెలివరీ అందించనుంది. దేశవ్యాప్తంగా 19 నగరాలు, 3,000 పిన్‌కోడ్ల పరిధిలో ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ సేవలు అందుబాటులో ఉంటాయి. మొబైళ్లు, ఎలక్ట్రానిక్స్, కిరాణా, పండ్లు, కూరగాయలు, బ్యూటీ, పర్సనల్ కేర్ వంటి విభాగాల్లో ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. ఫ్లిప్‌కార్ట్ ప్లస్, బ్లాక్ మెంబర్లకు ముందస్తు యాక్సెస్, ప్రత్యేక రివార్డులు లభిస్తాయి. తాజా కాయగూరలు రూ.9 నుంచి ప్రారంభమవుతాయి. దేశీ బ్రాండ్లతో పాటు అంతర్జాతీయ బ్రాండ్ల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. స్వీట్స్, హాంపర్స్, లిప్‌స్టిక్స్ రూ.49 నుంచి, డియోడరెంట్లు, పెర్ఫ్యూమ్‌లపై 80% వరకు తగ్గింపులు ఉండబోతున్నాయి. గౌర్మెట్ బ్రాండ్లపై 50% వరకు డిస్కౌంట్లు లభిస్తాయి. "ఈ సంవత్సరం మేము వేగం, విలువ, విశ్వసనీయతతో బిగ్ బిలియన్ డేస్‌ను మరింత వినూత్నంగా మార్చుతున్నాం. మెట్రో నగరాలతో పాటు చిన్న పట్టణాల్లోనూ వినియోగదారులకు వేగంగా సేవలు అందించడమే మా లక్ష్యం" అని ఫ్లిప్‌కార్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హేమంత్ బద్రీ అన్నారు.

# జీఎస్టీ తోడు.. ఇక ఇల్లు కట్టొచ్చు చూడు!



కేంద్రం ప్రభుత్వం వస్తు సేవల పన్ను(జీఎస్టీ)ని సవరించింది. జీఎస్టీ సంస్కరణలు దేశీయ రియల్ ఎస్టేట్ రంగానికి ప్రధానమైన సానుకూల మార్పు కానున్నాయి. ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్న జీఎస్టీ 2.0 నిర్మాణ రంగానికి పెద్ద ఉపశమనమే కలిగిస్తుంది. సామాన్యుల సొంతింటి కల సాకారానికి కాస్త సాయం చేయనుంది. నిర్మాణ రంగంలో కీలకమైన సిమెంట్, ఇసుక, ఇటుకలు, గ్రానైట్, మార్బుల్స్, టైల్స్, రంగులు వంటి పలు నిర్మాణ సామగ్రి ధరలపై కేంద్రం జీఎస్టీని తగ్గించింది. సాధారణంగా ఇంటి నిర్మాణంలో అయ్యే ఖర్చులో 40-45 శాతం వ్యయం నిర్మాణ సామగ్రిదే ఉంటుంది. తాజా జీఎస్టీ సవరణతో నిర్మాణ సామగ్రిపై అయ్యే ఖర్చులో 10-15 శాతం వరకు ఆదా అవుతుంది. ఫలితంగా మొత్తం ఇంటి నిర్మాణ వ్యయం 4-6 శాతం వరకు ఖర్చు తగ్గుతుంది.

**ఏ నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ ఎంతంటే?**


సిమెంట్, రెడీమిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ): గతంలో 28 శాతం జీఎస్టీ ఉండగా.. 18 శాతానికి తగ్గింది. టైల్స్, ఇసుక, ఇటుకలు: 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గింది. రంగులు, వార్నిష్: 28 శాతం నుంచి 18 శాతం తగ్గింది. మార్బుల్, గ్రానైట్: 12 శాతం ఉండగా.. 5 శాతానికి తగ్గింది. సహజ ఇసుక: 5 శాతం ఉండగా.. సున్నా శాతానికి తగ్గింది. స్టోన్ ఇన్‌లే వర్క్: 12 శాతం ఉండగా.. 5 శాతానికి తగ్గింది. వుడెన్ ఫ్లోరింగ్: 28 శాతం నుంచి 18 శాతం తగ్గింది. వెదురు ఫ్లోరింగ్: 12 శాతం ఉండగా.. 5 శాతానికి తగ్గింది. సానిటరీవేర్: 18 శాతం నుంచి సున్నా శాతానికి తగ్గింది. పీవీసీ, యూపీవీసీ పైపులు, ఫిట్టింగ్‌లు: 18 శాతం నుంచి సున్నా శాతానికి తగ్గింది. ఇనుము, ఉక్కు ఉత్పత్తులు: 18 శాతం నుంచి సున్నా శాతానికి తగ్గింది. వాల్‌పేపర్లు: 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గింది. కరెంట్ వైర్లు: 18 శాతం నుంచి సున్నా శాతానికి తగ్గింది. ప్లైవుడ్, పార్టికల్, ఫైబర్ బోర్డులు: 18 శాతం నుంచి సున్నా శాతానికి తగ్గింది. హ్యాండ్‌మేడ్ కార్పెట్లు, ఫ్లోర్ కార్వింగ్‌లు: 12 శాతం ఉండగా.. 5 శాతానికి తగ్గింది.

# ఆన్‌లైన్ ఫుడ్.. ఊహించని షాక్


ఆన్‌లైన్ ఫుడ్ లవర్స్‌కు ఊహించని షాక్ ఇది. జొమాటో, స్విగ్గీ యూజర్లపై అదనపు భారం పడనుంది. ఫుడ్ డెలివరీ చార్జీలు అమాంతం పెరగనున్నాయి. ఈ నెల 22వ తేదీ నుంచి అమలులోకి రానున్న జీఎస్టీ మార్పులతో ఫుడ్ డెలివరీలు మరింత భారం కానున్నాయి. జొమాటో, స్విగ్గీ వంటి యాప్‌లు డెలివరీ ఫీజులపై అదనంగా 18% జీఎస్టీ వర్తింపజేయాల్సి ఉంటుంది. ఫుడ్ ఆర్డర్‌లపై ప్రస్తుతం ఉన్న 5% జీఎస్టీ కంటే డెలివరీ చార్జీలే అధికం. స్థానిక డెలివరీ సేవలు సీజీఎస్టీ చట్టంలోని సెక్షన్ 9(5) కిందికి వస్తాయని జీఎస్టీ కౌన్సిల్ ధ్రువీకరించింది. పండగల వేళ ఇప్పటికే ఆయా కంపెనీలు ప్లాట్‌ఫామ్ ఫీజు పెంచి వినియోగదారులపై మోయలేని భారం మోపగా, ఇప్పుడు జీఎస్టీ బాదుడు మొదలుకానుంది. జీఎస్టీ భారాన్ని వినియోగదారుల నుంచే వసూలు చేస్తారు. ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్ చేసినప్పుడు రెండు రకాల జీఎస్టీ వర్తిస్తుంది. ఒకటి ఆర్డర్ చేసే ఆహారంపై ఉండగా, రెండోది డెలివరీ చార్జీలపై అమలులోకి రానుంది. ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్‌పై ఉన్న 5 శాతం జీఎస్టీ జనవరి 2022 నుంచి అమలులోకి వచ్చింది. అయితే ఇప్పుడు ఫుడ్ ఆర్డర్‌పై ఎలాంటి మార్పులు చేయలేదు. కానీ, డెలివరీ ఫీజుపై 18 శాతం జీఎస్టీ వసూలు చేయనున్నారు. స్విగ్గీ, జొమాటో వంటి కంపెనీలు ఒకప్పుడు డెలివరీ చార్జీలే వసూలు చేసేవి. కొన్నాళ్లకు ప్లాట్ ఫామ్





ఫీజు విధానాన్ని తెచ్చాయి. మొదట రూ.2 చొప్పున ప్రారంభించి ఇప్పుడు రూ.15 వరకు పెంచాయి. స్విగ్గీలో ఇప్పుడు డెలివరీ చార్జీలు రూ.15 కాగా, జొమాటోలో రూ.12.50గా ఉంది. మ్యాజిక్ పిన్‌లో రూ.10గా ఉంది. డెలివరీ చార్జీలపై ఇక కొత్తగా విధించే 18 శాతం జీఎస్టీతో జొమాటో వినియోగదారులపై అదనంగా ఒక్కో ఆర్డర్‌కు రూ.2 చెల్లించాల్సి వస్తుంది. స్విగ్గీలో రూ.2.60 చొప్పున భారం పడనుంది. అదనంగా రూ.5 పైన చెల్లించాల్సి రావచ్చని తెలుస్తోంది. కేంద్ర ఆర్థక మంత్రిత్వ శాఖ ఈ విషయంపై మంగళవారం కీలక ప్రకటన చేసింది. డెలివరీ సర్వీసుల జీఎస్టీ విధింపు అంశంపై క్లారిటీ ఇచ్చింది. లోకల్ డెలివరీలపై జీఎస్టీ 18 శాతంగా ఉంటుందని తెలిపింది. రిజిస్టర్డ్ పర్సన్ నేరుగా లోకల్ డెలివరీ చేస్తే సదరు వ్యక్తి 18 శాతం జీఎస్టీ కట్టాల్సి ఉంటుందని పేర్కొంది. ఇక లోకల్ డెలివరీలను మరో వ్యక్తి (రిజిస్టర్ కాని వ్యక్తి) సరఫరా చేస్తే జీఎస్టీ 18 శాతం ఈసీఓ చెల్లించాల్సి ఉంటుంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL






# రాజకీయాల్లో జోక్యం చేసుకోను

## కేథలిక్ చర్చి, వలసలపై మాత్రం మాట్లాడుతా... మొట్టమొదటి ఇంటర్వ్యూలో పోప్ లియో వెల్లడి

**రోమ్:** అగ్రరాజ్యం అమెరికా రాజకీయాల్లో జోక్యం చేసుకునే ఉద్దేశం తనకు లేదని పోప్ లియో స్పష్టం చేశారు. అయితే, ఆ దేశంలో కేథలిక్ చర్చి, వలసలకు సంబంధించిన అంశాలపై మాత్రం మాట్లాడుతానన్నారు. అమెరికాకు చెందిన మొట్టమొదటి పోప్‌గా చరిత్ర సృష్టించిన లియో మొదటిసారిగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మతబోధకులపై లైంగిక వేధింపుల ఆరోపణలు, ఎల్జీబీటీక్యూ ప్లస్ కేథలిక్కులు, వాటికన్-చైనా సంబంధాలు సహా పలు అంశాలపై మాట్లాడారు. వాటికన్ కరస్పాండెంట్ ఎలిస్ అన్ అల్లెన్‌కు ఇచ్చిన ఈ ఇంటర్వ్యూ గురువారం ప్రచురితమైంది. 'కేథలిక్ చర్చిలోకి అందరూ ఆహ్వానితులే'అంటూ ఎల్జీబీటీక్యూ ప్లస్ కేథలిక్కులను ఉద్దేశించి దివంగత పోప్ ఫ్రాన్సిస్ ఇచ్చిన సందేశాన్ని తానూ స్వీకరిస్తున్నానన్నారు. లైంగిక సంబంధ అంశాల్లో చర్చి వైఖరి మారడానికి దాదాపుగా అవకాశమేలేదని స్పష్టం చేశారు. హోమోసెక్సువల్ వ్యక్తులను కూడా గౌరవించాలని కేథలిక్ చర్చి చెబుతోందన్నారు. అయితే, స్వలింగ వివాహాన్ని చర్చి వ్యతిరేకిస్తుందన్నారు. వివాహం ఆడ, మగ జరగాల్సిందని స్పష్టంగా చెబుతోందని పోప్ లియో అన్నారు. చైనాతో సంబంధాలపై ఆయన..బిషప్పుల నియామకంపై 2018లో చైనాతో చేసుకున్న వివాదాస్పద ఒప్పందంలో సమీప భవిష్యత్తులో మార్పులు జరిగే అవకాశం లేదని భావిస్తున్నానన్నారు. చైనాలో వివిధ చర్చిల పరిధిలో ఉన్న కోటికి పైగా కేథలిక్కులను ఏకం చేసే లక్ష్యంతో పోప్ ఫ్రాన్సిస్ హయాంలో వాటికన్ ఈ ఒప్పందం కుదుర్చుకుంది. చర్చిల్లో లైంగిక వేధింపుల కుంభకోణాలను ప్రస్తావించిన పోప్ లియో..నిజంగా ఇదో సంక్షోభమన్నారు. బాధితుల్లో 90 శాంత వరకు ముందుకొచ్చి తన ఆరోపణలు చేస్తున్నారని, వీరి సాంత్వన కలిగించే విషయంలో చర్చి వ్యవస్థ ఒక పరిష్కారాన్ని కనుగొనలేకపోయిందని చెప్పారు. అదే సమయంలో మతబోధకుల హక్కులను కూడా గౌరవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రపంచ వ్యవహారాలపై అమెరికా పలుకుబడి గణనీయంగా ఉందన్న లియో..కేథలిక్ చర్చి వలసలను కూడా ఒక ముఖ్యమైన అంశంగానే భావిస్తోందని స్పష్టం చేశారు. ట్రంప్ ప్రభుత్వ వలసదారుల వ్యతిరేక చర్యలను పోప్ ఫ్రాన్సిస్ ఇచ్చిన పిలుపు మేరకు అమెరికా బిషప్పులు బహిరంగంగానే వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తోటి మనిషిని తగు రీతిలో గౌరవించాలన్నదే తమ అభిమతమని చెప్పారు.

# రష్యాలో భారీ భూకంపం.. సునామీ హెచ్చరికలు జారీ

రష్యాలో భారీ భూకంపం సంభవించింది. భవనాలు తీవ్రంగా ఊగిపోయాయి. ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. రిక్టర్‌స్కేల్‌పై భూకంపం తీవ్రత 7.8గా నమోదు అయింది. దీంతో యూఎస్ జాతీయ ఆరోగ్య సర్వీస్ విభాగం సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ప్రాణ, ఆస్తి నష్టంపై స్పష్టత రావాల్సి ఉంది. పెట్రోపావ్లోవ్స్‌కామ్చాట్‌స్కీ రీజియన్‌లో గురువారం అర్ధరాత్రి దాటాక ప్రకంపనలు సంభవించాయి. భూకంపం కేంద్రం 10 కి.మీ దూరంలో ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. అనంతరం స్వల్ప వ్యవధిలో మరో ఐదుసార్లు స్వల్ప ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. రష్యాలో తరచూ భూకంపాలు సంభవించడానికి ప్రధాన కారణం—అది పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ (Pacific Ring of Fire) లో భాగంగా ఉండటం. ఇది భూమి మీద అత్యంత చురుకైన భూకంప, అగ్నిపర్వత ప్రాంతం. ప్రధానంగా కమ్చట్కా ద్వీపకల్పం ప్రాంతం పసిఫిక్ ప్లేట్ యూరేషియన్ ప్లేట్ మధ్య ఉంది. ఇవి ఒకదానిని మరొకటి గుద్దుతూ కదలడం వల్ల భూకంపాలు ఏర్పడతాయి. ఇదిలా ఉంటే.. ఇటు ఇండోనేషియాలోనూ 6.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. సెంట్రల్ పపువా ప్రావిన్స్‌లో శుక్రవారం వేకువ జాము సమయంలో ప్రకంపనలు వచ్చినట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. 28 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడించింది. అయితే ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లలేదని సమాచారం.




# భారత్‌కు అల్టిమేటమా?..

## ఏమాత్రం పనిచేయదు

టారిఫ్‌ల బెదిరింపులతో భారత్‌ను తమ దారికి తెచ్చుకునేందుకు అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందా?.. అయితే అది ఎట్టి పరిస్థితుల్లో జరిగే పని కాదని.. అలాంటి అల్టిమేటంలు ఎన్ని ఇచ్చినా భారత్ తలవంచబోదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గే లావ్రోవ్ అభిప్రాయపడ్డారు. భారత్, చైనాలు ప్రాచీన నాగరికతలు ఉన్న దేశాలని, అలాంటి దేశాలపై అమెరికా విధిస్తున్న టారిఫ్‌లు, ఒత్తిడులు ఏమాత్రం పని చెయ్యబోవని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ అంటున్నారు. రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేయడం ఆపాలని చేస్తున్న ఒత్తిళ్లు.. ఆ దేశాలను అమెరికాకు మరింత దూరం చేస్తాయే తప్ప ప్రయోజనం ఉండబోదని 'ది గ్రేట్ గేమ్' అనే టీవీ కార్యక్రమంలో లావ్రోవ్ వ్యాఖ్యానించారు. రష్యా నుంచి చమురు, ఆయుధాల కొనుగోలు ద్వారా.. ఉక్రెయిన్‌పై యుద్ధానికి భారత్ పరోక్షంగా ఫండింగ్ చేస్తోందని అమెరికా ఆరోపిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే 25 శాతం పెనాల్టీ సుంకాలను ట్రంప్ విధించారు(మొత్తం 50 శాతం). రష్యాతో వాణిజ్యం ఆపకపోతే మరిన్ని ఆంక్షలు తప్పవంటూ హెచ్చరిస్తున్నారు. అయితే భారత్ ఈ ఆరోపణలను ఖండిస్తూ వస్తోంది. ఈ పరిణామాలపై సెర్గీ స్పందించారు. "నాకు నచ్చనిది వెంటనే ఆపండి. లేకుంటే మరిన్ని సుంకాలు విధిస్తా" అనే భాష ఆ దేశాలపై ప్రయోగించడం ఏమాత్రం సరికాదు. అలాంటి బెదిరింపులు ప్రాచీన నాగరికత ఉన్న ఆ దేశాలపై పని చేయవు కూడా అని



అన్నారాయన. పైగా.. ఈ తరహా విధానం ఆ దేశాల ఆర్థిక స్థితిని దెబ్బతీయడమే కాకుండా, వారికి తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. కొత్త మార్కెట్లు, కొత్త ఇంధన వనరులు వెతకాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అంతేకాక, ఎక్కువ ధరలు చెల్లించాల్సి వస్తుంది. అయితే, దీని కంటే కూడా ముఖ్యమైన విషయం ఏమిటంటే—ఈ విధానానికి నైతికంగా, రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత ఏర్పడే అవకాశం ఉంది అని పేర్కొన్నారాయన. ఇక రష్యాపై కొత్త ఆంక్షల విధింపు బెదిరింపులపైనా ఆయన స్పందించారు. "నిజం చెప్పాలంటే.. కొత్త ఆంక్షల వల్ల ఎలాంటి సమస్య కనిపించడం లేదు. ట్రంప్ మొదటి పదవీకాలంలోనే ఎన్నో ఆంక్షలు విధించబడ్డాయి. బైడెన్ పదవీకాలంలో ఆంక్షలకు బదులు దౌత్యపరమైన చర్చలు తెరమీదకు వచ్చాయి. కానీ, అమెరికాతో రాజీ కోసం ఎలాంటి ప్రయత్నం జరగలేదు" అని ఆయన కుండబద్దలు కొట్టారు. ఇదిలా ఉంటే.. రష్యాతో చమురు, ఆయుధ కొనుగోళ్ల అంశంతో భారత్‌పై ట్రంప్ సుంకాలు విధించారు.

# ముసుగు పూర్తిగా తొలగింది.. ఇరకాటంలో పాక్!

అబ్బే.. ఆపరేషన్ సిందూర్‌తో మా భూభాగంలో వేటికి డ్యామేజ్ కాలేదు. పైగా ఆపరేషన్ బనియన్ ఉల్ మర్సూస్‌తో కౌంటర్ ఆపరేషన్ చేసి భారత యుద్ధ విమానాలను నేలకూల్చాం.. ఇదీ ఇప్పటికీ పాకిస్థాన్ చెబుతున్న మాట. కళ్లెదుట ఉగ్రస్థావరాలు, సైనిక శిబిరాలు నేలమట్టం అయిన ఆధారాలు కనిపిస్తున్నా కూడా పాక్ ఈ వాదన నుంచి పక్కకు పోవడం లేదు. ఈ క్రమంలో పాక్‌ను ఇరకాటంలో పడేస్తున్నాయి ఉగ్రవాద సంస్థలు. భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్‌లో తమ స్థావరం ధ్వంసమైందంటూ ఇటీవల జేషే కమాండర్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇది చర్చలో ఉండగానే.. తాజాగా లష్కరే తాయిబా అలాంటి ప్రకటనే చేసింది. మురిద్కేలో తమ స్థావరం భారత దాడుల్లో నాశనమైందంటూ ఎల్ఈటీ కమాండర్ ఖాసిమ్ అంగీకరించాడు. ఈ మేరకు ఓ వీడియో సైతం అతను పోస్ట్ చేశాడు. ఇది మళ్లీ నిర్మాణంలో ఉంది. అల్లా కృపతో ఇది ముందుకన్నా పెద్దదిగా నిర్మించబడుతుంది. ఈ శిబిరంలో ముజాహిదీన్, తాలిబులు (students) శిక్షణ పొందారని కూడా వెల్లడించాడు. అయితే.. పాకిస్తాన్ ప్రభుత్వం ఈ భవనం ఉగ్రవాద కార్యకలాపాలకు ఉపయోగించడంలేదని చెబుతున్నప్పటికీ.. LeT డిప్యూటీ చీఫ్ సైఫుల్లా కసూరీ మరో వీడియోలో పాక్ ప్రభుత్వం, ఆర్మీ ఈ కేంద్రాన్ని పునర్నిర్మించేందుకు నిధులు అందించాయని చెప్పడం



కొసమెరుపు. దీంతో.. తమ భూభాగంలో ఉగ్రస్థావరాలే లేవంటూ అసత్యాలు వల్లెవేస్తోన్న పాక్ ముసుగు తొలగిందని, ఉగ్ర సంస్థల బహిరంగ ప్రకటన చెంపపెట్టుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ 2025 మే 7న భారత సాయుధ దళాలు చేపట్టిన మెరుపు దాడి. ఇది పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై జరిపారు. త్రివిధ దళాలు సంయుక్తంగా ఈ దాడిలో పాల్గొన్నాయి. ఈ దాడితో లష్కరే తోయిబా, జైష్‌ఏమొహమ్మద్ వంటి సంస్థల మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి.





# ప్రభాస్ సినిమాలో ఆ బాలీవుడ్ క్రేజీ హీరో!

## బాక్సాఫీస్ రికార్డులు బద్దలవుతాయంతే!

ఇటీవల బాలీవుడ్ తారలు దక్షిణ భారత చిత్ర పరిశ్రమకు వస్తున్నారు. సంజయ్ దత్, సైఫ్ అలీ ఖాన్, అమితాబ్ బచ్చన్, ఇమ్రాన్ హష్మీ, బాబీ డియోల్, ఆమిర్ ఖాన్ తదితరులు తెలుగుతో పాటు దక్షిణాది సినిమాల్లో నటించారు. ఇప్పుడు ఈ వరుసలో మరో బాలీవుడ్ స్టార్ చేరుతున్నాడు. అతనే అమితాబ్ బచ్చన్ కుమారుడు అభిషేక్ బచ్చన్. హిందీలో సినిమాలు, వెబ్ సిరీస్ లతో బిజీగా ఉంటోన్న అభిషేక్ ఇప్పుడు తొలిసారిగా దక్షిణ భారత చిత్రంలో నటించబోతున్నాడని సమాచారం. ఇంతకు ముందు ప్రభాస్ నటించిన పాన్ఇండియా చిత్రం 'కల్కి 2898 AD'లో అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో నటించారు. ఈ సినిమా సీక్వెల్‌లో కూడా బిగ్ బీ నటించనున్నారు. ఇప్పుడు ప్రభాస్ కొత్త చిత్రంలో అభిషేక్ బచ్చన్ ప్రధాన పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ నటిస్తోన్న సినిమాల్లో 'ఫౌజీ' కూడా ఒకటి. స్వాతంత్ర్యానికి ముందు జరిగిన ప్రేమకథ గా ఈ మూవీ తెరకెక్కుతోందని తెలుస్తోంది. 'సీతా రామం' వంటి బ్లాక్ బస్టర్ మూవీకి దర్శకత్వం వహించిన హను రాఘవ పూడి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పుడు ఈ చిత్రంలో అభిషేక్ బచ్చన్ కీలక పాత్ర పోషిస్తారని సమాచారం. 'ఫౌజీ' చిత్ర బృందం ఇప్పటికే అభిషేక్ బచ్చన్‌తో చర్చలు జరిపిందని, అతనికి కూడా కథ నచ్చి ఈ చిత్రం చేయడానికి అంగీకరించారని టాక్. అభిషేక్ బచ్చన్ వీలైనంత త్వరగా 'ఫౌజీ' బృందంలో చేరతారని సమాచారం. అభిషేక్ బచ్చన్ ప్రస్తుతం షారుఖ్ ఖాన్ 'కింగ్', రితేష్‌దేశ్‌ముఖ్ 'రాజా శివాజీ' చిత్రాల్లో నటిస్తున్నాడు. కాగా 'ఫౌజీ' అభిషేక్ బచ్చన్ నటించిన తొలి దక్షిణ భారత చిత్రం అవుతుంది. ప్రభాస్ ప్రస్తుతం పలు చిత్రాలతో బిజీగా ఉన్నాడు. 'ది రాజా సాబ్' వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది. 'ఫౌజీ' కూడా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుది. ఈ ఏడాది నవంబర్‌లో సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించే 'స్పిరిట్' షూటింగ్‌ను ప్రారంభించనున్నాడు. ఆ తర్వాత ప్రభాస్ 'కల్కి 2898 AD'లో, ఆ తర్వాత 'సలార్ 2'లోనూ ప్రభాస్ నటించాల్సి ఉంది.



## డేటింగ్‌పై క్లారిటీ ఇచ్చేసిన భామ!

బాలీవుడ్ భామ శ్రద్ధా కపూర్ గతేడాది బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. రాజ్‌కుమార్ రావు నటించిన స్త్రీ2 మూవీతో సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉంది ముద్దుగుమ్మ. నాగిన్ మూవీతో పాటు మరో రెండు చిత్రాల్లో కనిపించనుంది. అటు షూటింగ్‌లతో బిజీగా ఉండే శ్రద్ధా కపూర్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటోంది. ఎక్కడికెళ్లినా నెట్టింట పోస్టులు పెడుతూనే ఉంది. గతంలో స్క్రిప్ట్ రైటర్ రాహుల్ మోడీతో ఉన్న ఫోటోలు షేర్ చేయడంతో శ్రద్ధాపై డేటింగ్ రూమర్స్ వినిపించాయి. ముంబయిలో డిన్నర్ డేట్ తర్వాత అతనితో కలసి రెస్టారెంట్ నుంచి బయటకు వస్తున్న వీడియోలు అప్పట్లో వైరలయ్యాయి. ఆ తర్వాత చాలాసార్లు అతనితో కలిసి జంటగా కనిపించింది.అనిల్ అంబానీ పెళ్లి వేడుకలోనూ మెరిశారు. దీంతో వీరిద్దరి డేటింగ్ నిజమేనని బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తూనే ఉంది. తాజాగా శ్రద్ధా కపూర్ సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేసింది. మీ కోపా తాపాలను భరించే వ్యక్తి మీ లైఫ్‌లో కనుగొనండి అంటూ వీడియోకు క్యాప్షన్ రాసుకొచ్చింది. అంతేకాకుండా తన బాయ్‌ఫ్రెండ్‌గా భావిస్తోన్న రాహుల్ మోదీని ట్యాగ్ చేసింది. ఆ వీడియోను రాహులే తీసినట్లు తెలుస్తోంది. మీ జీవితంలో హట్ లాంటివి వినే వాళ్లు ఎవరై ఉంటారని హింట్ ఇచ్చింది. ఇది చూసిన అభిమానులు రాహుల్‌తో డేటింగ్ కన్‌ఫామ్ చేసేసిందని కామెంట్స్ పెడుతున్నారు. ఈ వీడియోతో రాహుల్‌తో డేటింగ్‌లో ఉన్నట్లు పరోక్షంగానే చెప్పేసిందని పోస్ట్ చేస్తున్నారు.గతడాది డిసెంబర్‌లోనూ రాహుల్‌తో వడా పావ్ డేట్ గురించి పోస్ట్ చేసింది. అంతకుముందు ఆమె ఫోన్ వాల్‌పేపర్‌లో అతనితో దిగిన ఫోటోతో దొరికిపోయింది. ఇవాళ పోస్ట్ చేసిన వీడియోతో వీరిద్దరి డేటింగ్ ఉన్నట్లేనని అభిమానులు భావిస్తున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే చివరిసారిగా 'స్త్రీ 2'లో కనిపించింది. ప్రస్తుతం ఆమె నిఖిల్ ద్వివేది తెరకెక్కిస్తోన్న 'నాగిన్'లో కనిపించనుంది.




## తెలుసు కదా పూర్తి

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' చిత్రాల ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా' చిత్రీకరణ పూర్తయింది. ఈ మూవీలో రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటించగా, వైవా హర్ష కీలక పాత్ర పోషించారు. స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రం ద్వారా దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా లొకేషన్‌లో కేక్ కట్ చేసుకుని సెలబ్రేట్ చేసుకుంది యూనిట్. ''మోస్ట్ ఎవైటెడ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'తెలుసు కదా'. నీరజ కోన చాలా యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఇటీవల విడుదల చేసిన మా మూవీ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. తమన్ మ్యూజిక్ అందించిన ఈ చిత్రం నుంచి త్వరలో సెకండ్ సాంగ్ రిలీజ్ కానుంది. అక్టోబర్ 17న మా సినిమా విడుదల కానుంది'' అని చిత్రబృందం పేర్కొంది.



## నా ఫిట్‌నెస్ సీక్రెట్ ఫుడ్ ఇదే : రష్మిక

హీరోయిన్లు అందాన్ని కాపాడుకోవడానికి ఫిట్‌నెస్ చాలా ముఖ్యం. ఇందుకోసం కొందరు నోరు కూడా కట్టుకుంటున్నారని చెప్పవచ్చు. అలాంటి నటీమణుల్లో రష్మిక మందన్న కూడా ఉన్నారు. ఈ కన్నడ బ్యూటీ మాతృభాషలో నటిగా తన ప్రయాణాన్ని ప్రారంభించి ఆ తర్వాత తెలుగు, తమిళం ఇటీవల హిందీ భాషలోనూ నటిస్తూ పాన్ ఇండియా క్రష్ గా మారారు. అతి తక్కువ కాలంలోనే అంటే కేవలం 9 ఏళ్లలోనే పాన్ ఇండియా కథానాయకిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. తెలుగు చిత్రం పుష్ప–2 రష్మిక మందన్న పాన్ ఇండియా కథానాయకిగా మార్చితే, బాలీవుడ్ లో నటించిన యానిమల్ చిత్రం మరింత స్థాయిని పెంచింది. కాగా 29 ఏళ్ల ఈ పరువాల భామ ఫిట్నెస్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. కాగా ఓ భేటీలో తన ఫిట్నెస్ గురించి రష్మిక మందన్న తెలుపుతూ ఉదయాన్నే లేవగానే లీటర్ నీళ్లు తాగుతానన్నారు. ఆ తర్వాత డైటీషియన్ ఇచ్చే యాపిల్ సైడర్ వినీగర్ సేవిస్తానన్నారు. ఇప్పడు తాను శాకాహారిగా మారినట్లు చెప్పారు. అందువల్ల మాంసాహారం జోలికి వెళ్లడం లేదని, అదేవిధంగా వరి అన్నాన్ని ఎక్కువగా తీసుకోనని చెప్పారు. రాత్రిపూట కూడా ఆహారాన్ని తక్కువగా తీసుకుంటానని చెప్పారు. ముఖ్యంగా టమాటో , బంగాళదుంప, దోసకాయ వంటి కాయగూరల్లో ఎలర్జీ ఉంటుందన్నారు. అందువల్ల వాటిని తినడం మానేశానన్నారు. ఇకపోతే నిత్యం సాయంకాలం శారీరక కసరత్తులు చేస్తానని రష్మిక మందన్నా తన ఫిట్నెస్ రహస్యం గురించి చెప్పారు. కాగా చివరిగా ఈ బ్యూటీ నటించిన చిత్రం కుబేర. ప్రస్తుతం ది గర్ల్ ఫ్రెండ్ అనే చిత్రంతోపాటూ హిందీలో తమా, కాక్‌టైల్ 2 చిత్రాలు చేస్తున్నారు. అదేవిధంగా రాఘవ లారెనన్స్ స్వీయ దర్శకత్వంలో కథానాయకుడుగా నటిస్తున్న కాంచన 4 చిత్రంలోని రష్మిక కీలకపాత్రను పోషిస్తున్నట్లు సమాచారం. కాగా నటి రష్మిక మందన్నా మరో హిందీ చిత్రంలో నటించటానికి సిద్ధమవుతున్నట్లు తాజా సమాచారం. బాలీవుడ్లో సూపర్ హీరో కథాంశంతో రూపొందిన క్రిష్ చిత్రానికి ప్రత్యేక స్థానం ఉంది. హృతిక్ రోషన్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి ఇప్పటికే మూడు భాగాలు రూపొందాయి. కాగా తాజాగా క్రిష్ –4 తెరకెక్కనుందని అందులో హృతిక్ రోషన్, ప్రియాంక చోప్రోతో కలిసి నటి రష్మిక మందన్న నటించనున్నట్లు ప్రచారం హోరెత్తుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com